
# మణిహారం

2



MOTHIYON KA HAAR - PART II
(Telugu)

# మణిహారం

(రెండవ భాగం)

మూలం
మౌలానా అఫ్‌జల్ హుసైన్

అనువాదం
అబ్దుల్ వాహెద్

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్)
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583

Maniharam - 2nd Part

**Mothiyon ka Haar (Part III & IV) - 2** (Telugu)

**T.I.P. Series No. 69**


| | | |
|---|---|---|
| Author | : | Maulana Afzal Hussain |
| Translated by | : | Abdul Wahed |


All Rights Reserved with Publishers


| | | |
|---|---|---|
| 3rd Edition | : | March 2013 |
| Copies | : | 2,000 |
| Price | : | **Rs. 15** |
| ISBN | : | 81 86826 68 8 |

Published by **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +040 + 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

| | | |
|---|---|---|
| Typeset by | : | Geeturai Graphics<br>Lakkadkot, Hyderabad - 2 |
| Printed at | : | Cosmic Printer,<br>Lakkad kot, Hyderabad. |

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# పరదా

సిగ్గు, లజ్జ అనేవి ఆడపిల్లలకు చాలా విలువయిన ఆభరణాలు, బుద్ధిమంతులయిన అమ్మాయిలు ఈ అమూల్య ఆభరణాలను చాలా జాగ్రత్తగా కాపాడుకుంటారు. ఈ ఆభరణాలను గనుక పోగొట్టుకుంటే అందరిముందు చిన్నబుచ్చుకోవలసివస్తుందని మంచి అమ్మాయిలకు తెలుసు. ఈ ఆభరణాలను ఎంత జాగ్రత్తగా దాచుకుంటే అంత గౌరవం వాళ్ళకు లభిస్తుందనీ తెలుసు.

సిగ్గు, లజ్జలను కాపాడుకోవడానికి అన్నిటికన్నా మంచి మార్గం పరదా. పరదా వల్ల పరుల కంటబడరు. వారి మర్యాదకు ఎలాంటి భంగమూ రాదు. అందుకే మంచి అమ్మాయిలు పరుల గాలిని కూడా తాకనివ్వరు. పరులు ఎలానూ పరాయివారే, తనవారి ముందు కూడా చాలా అణకువతో, నెమ్మదిగా ఉంటారు. నాన్న, అన్నయ్య, తమ్ముళ్ళ ముందు సయితం పల్చటి వస్త్రాలను ధరించి తిరుగరు.

ఇలాంటి మంచి మహిళలు అనేక మంది ఉన్నారు. సిగ్గు, లజ్జల విషయంలో వాళ్ళు అత్యంత జాగ్రత్తను పాటించారు. అయితే బీబీ ఆయెషా (రజి) ఈ విషయంలో అందరికీ ఉదాహరణగా నిలిచారు.

ఓసారి ఏమయ్యిందంటే, ఓ అంధుడు ఆమెతో కొన్ని ధార్మిక విషయాలను తెలుసుకోవాలని వచ్చాడు. ఆమెకు మంచి ధార్మిక పరిజ్ఞానం ఉండేది. అందులోనూ ఆమె హుజూర్ (స)కు అత్యంత ప్రేమపాత్రురాలయిన సతీమణి కదా. పెద్ద పెద్దవాళ్ళు ఆమెతో ధార్మిక విషయాల గురించి అడిగేవారు. హుజూర్ (స) ఆమెకు అనుమతిని కూడా ఇచ్చారు. సరే, అసలు విషయానికి వద్దాం. ఆ

అంధుడు వచ్చినప్పుడు ఆమె పరదా వేసుకున్నారు. వెంటనే అతడు, "నేను అంధుణ్ణి, నా ముందు పరదా అవసరమేముంది?" అనడిగాడు. అప్పుడు బీబీ ఆయెషా (రజి), "నీవు అంధుడవయితే, నేను అంధురాలను కాదుగదా. నీవు నన్ను చూడలేవు సరే, కాని, నేను నిన్ను చూడగలను."

ఎంత సముచితమయిన మాట ఇది! ఆ వ్యక్తి విని మౌనంగా ఊరుకున్నాడు.

పరదా విషయంలో బీబీ ఆయెషా (రజి) పాటించిన జాగ్రత్తల గురించి మరో సంఘటనలో తెలుస్తుంది.

ప్రియప్రవక్త (స), అబూబకర్ (రజి) ఇద్దరి సమాధులు ఆమె ఇంటిలోనే ఉన్నవి. ఇంటిలో ఓ వైపు కొంత స్థలముంది. ఆ స్థలాన్ని ఆయెషా (రజి) తన కోసమని ఉంచుకున్నారు. కాని, తరువాత హజ్రత్ ఉమర్ (రజి) ఆ స్థలాన్ని తన కోసమని అడిగి తీసుకున్నారు. ధర్మయుద్ధంలో మరణం తరువాత ఆయన అక్కడే సమాధి అయ్యారు. మొదటి రెండు సమాధుల్లో ఒకటి తండ్రిది, మరొకటి భర్తది. వారిద్దరి ముందు పరదా పాటించవలసిన అవసరం లేదు. కాని హజ్రత్ ఉమర్ (రజి) సమాధి చేరిన తరువాత ఆమె ఆ సమాధి స్థలానికి పరదా లేకుండా ఎన్నడూ వెళ్ళలేదు.

ఆమె స్వయంగా పరదా పట్ల జాగ్రత్త వహించడమే కాదు. ఓసారి ఆమె సోదరి కుమార్తె పల్చటి ఓణి తలపై కప్పుకుని ఆమె వద్దకు వచ్చింది. అది చూసిన వెంటనే బీబీ ఆయెషా (రజి) కోపంతో ఆ ఓణిని చింపి పారేశారు. దళసరి గుడ్డతో నేసిన ఓణిని తెప్పించి ఆమెకిచ్చారు.

ఓసారి బీబీ ఆయెషా (రజి) ఒకరి ఇంటికి అతిథిగా వెళ్ళారు. అక్కడ యుక్త వయస్కులైన అమ్మాయిలను తలపై దుప్పటి లేకుండా నమాజ్ చదువడం చూశారు. వాళ్ళను అలా చేయవద్దని కఠినంగా వారించారు. ఇక నుంచి దుప్పటి లేకుండా నమాజ్ చదువరాదని చెప్పారు.

# దైవస్మరణ

దైవ నామంలో చాలా సౌభాగ్యం ఉంది. అందుకే మనం ప్రతి పనిని దేవుని పేరుతో మొదలుపెడతాం. దైవభక్తులయితే కూర్చున్నా, నిలబడినా ఎల్లవేళలా దైవ నామాన్ని స్మరిస్తారు. దేవుని గొప్పదనాన్ని గుర్తుచేసుకుంటూ ఉంటారు. ఇలా చేయడం వల్ల చాలా లాభముంది. దైవం సంతోషిస్తాడు. అనేక సౌభాగ్యాలను ప్రసాదిస్తాడు. మనం ఎంతగా దేవుని ఘనతలను గుర్తుచేసు కుంటామో, అంతగా మనం మంచిగా మారే ప్రయత్నం చేస్తాం. తద్వారా దేవుని కారుణ్యాన్ని పొందాలని కృషి చేస్తాం.

మన దేశంలో ఓ ప్రముఖ దైవ భక్తుడు ఉండేవారు. ఆయన పేరు మౌలానా అయాస్ (రఅ). ఆయన మరణించి కేవలం కొన్ని సంవత్సరాలు మాత్రమే అయ్యింది. ఆయన చాలా మంచి మనిషి, దైవభక్తుడు. ఏదో విధంగా ప్రజలు ధార్మిక విషయాలను నేర్చుకునేలా, ఇతరులకు నేర్పే చైతన్యం వారిలో కలిగేలా ఆయన ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉండేవారు.

ఢిల్లీకి దగ్గరలో మేవాడ్ అనే ప్రాంతం ఉంది. అక్కడ వేలకొద్ది ముస్లిమ్‌లు ఉన్నారు. కాని, వారికి ధార్మిక జ్ఞానం లేదు. ఆయన అక్కడి ప్రజలకు అనేక సంవత్సరాలపాటు ధార్మిక విషయాలను నేర్పారు. అంతేకాదు, నేర్చిన విషయాలను ఇతరులకు నేర్పే ఉత్సాహాన్ని వారిలో కలిగించారు. దైవం ఆయనకు ఉత్తమ గతులను ప్రసాదించుగాక.

ఈ దైవ భక్తునికి జన్మనిచ్చిన తల్లి కూడా ధర్మనిష్ఠాపరురాలయిన మహిళ. ఎల్లప్పుడూ ఖుర్‌ఆన్ పఠనంలోనూ, దైవనామ స్మరణలోనూ ఉండేదామె. ఖుర్‌ఆన్ ఆమెకు పూర్తిగా కంఠస్థం. ఇంటిపని చేసుకుంటూ ఖర్‌ఆన్ చదువుతూ ఉండే దామె. ప్రతి రోజు కనీసం నాలుగు అధ్యాయాలను పఠించేదామె. అంతేగాక,

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ ........ 1900 పర్యాయాలు
సుబ్‌హానల్లాహ్, అల్ హమ్‌దులిల్లాహ్ ....... 200 పర్యాయాలు
లా ఇలాహ ఇల్లల్లాహ్, అల్లాహు అక్బర్ .......... 200 పర్యాయాలు
హస్‌బునల్లాహు వ నిఅమల్ వకీల్ .......... 100 పర్యాయాలు
లా ఇలాహ ఇల్లా అన్‌త సుబ్‌హానక
ఇన్నికున్‌తు మినజ్జాలిమీన్ .......... 100 పర్యాయాలు
యా హయ్యు యా ఖయ్యూమ్ .......... 200 పర్యాయాలు
అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మది వ్వ బారిక్ వ‌సల్లిమ్ ...5000 పర్యాయాలు

ఇంకా అనేక దైవస్మరణల్ని అనేక పర్యాయాలు ప్రతి రోజూ చదివేదామె. ఇదంతా ఆమె ఇంటి పని చేస్తూ చదువుతూ ఉండేది. సాధారణ మహిళల్లా తన విలువయిన సమయాన్ని ఆమె అనవసర మాటలతో వెళ్ళబుచ్చేది కాదు. అందుకే ఆమె అంతగా దైవస్మరణ చేయగలిగేది. ప్రతి ఏడు పవిత్ర రమజాన్ మాసంలో నలభైపర్యాయాలు ఖుర్‌ఆన్‌ను చదివేది. ఇలాంటి పుణ్యాత్మురాలయిన మహిళ ఒడిలో పెరిగిన బాలుడు మౌలానా అయాస్ (రఅ) దైవభక్తుడుగా మారడం ఏమంత ఆశ్చర్యకరం కాదు కదూ.

# తల్లిదండ్రుల సేవ

హజ్రత్ షుఐబ్ (అస) ఓ ప్రముఖ ప్రవక్త. ఆయనను దైవం మదీనా వాసులను సంస్కరించమని పంపాడు. ఆయన (అస) చాలా ముసలివారై పోయారు. కళ్ళు కూడా మసకబారిపోయాయి. ఆయన ఇంటిలో కుమారులు ఎవ్వరూ లేరు. కేవలం ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ ఇద్దరు కుమార్తెలే ఇంటి పని చేసుకుంటూ తల్లిదండ్రులకు సేవ చేసేవారు. ఇంటిలో మేకలను పెంచే వారు. ఈ ఇద్దరు అమ్మాయిలూ ఆ మేకలను మేపడానికి తోలుకెళ్ళేవారు.

మేకలకు బావిలోని నీళ్ళు త్రాపించి ఇంటికి తీసుకునివచ్చేవారు.

ఓసారి, ఇద్దరు అమ్మాయిలూ మేకలను తీసుకుని బావి వద్దకు వచ్చారు. అక్కడ ఇతర కాపరులు బావిలో నీళ్ళను తోడి తమ పశువులకు త్రాగిస్తున్నారు. ఈ ఇద్దరు అమ్మాయిలకు సిగ్గు ఎక్కువ. తమ మేకలను దూరంగా నిలబెట్టి తాము నిలబడి ఉన్నారు. ఇంతలో ఓ క్రొత్త వ్యక్తి వారిని చూశాడు. దగ్గరకు వచ్చి, ఎందుకు నిలబడ్డారని అడిగాడు. అప్పుడు అమ్మాయిలు "మా ఇంటిలో మగవాళ్ళు లేరు, నాన్నగారు ఉన్నా చాలా ముసలివారు. కళ్ళు కనబడవు. మేం అక్కాచెల్లెళ్ళమే మేకలను మేపుకొస్తాం. ఈ కాపరులంతా తమ పశువులకు నీళ్ళు పెట్టి వెళ్ళిపోయిన తరువాత మేం మేకలకు నీళ్ళు పెట్టుకుంటాం." ఆ వ్యక్తి జాలిపడి ఆ అమ్మాయిలకు సహాయం చేశాడు. నీళ్ళు తోడి మేకలకు త్రాగించాడు. ఆ అమ్మాయిలు మేకలను తీసుకుని ఇంటికి వెళ్ళిపోయారు. తండ్రికి జరిగినదంతా చెప్పారు.

హజ్రత్ షుఐబ్ (అస) ఆ వ్యక్తిని పిలుచుకురమ్మన్నారు. పెద్ద కూతరు బీబీ సఫూరా సిగ్గుపడుతూ వెళ్ళి ఆ వ్యక్తిని పిలుచుకువచ్చింది. ఇంటికి వచ్చిన తరువాత తెలిసింది ఆ వ్యక్తి హజ్రత్ మూసా (అస) అని. ఈజిప్ట్‌లోని ఫిరౌను అత్యాచారాలను సమాప్తం చేయడానికి ఆయన ఫిరౌనుపై చేయెత్తాడు. కాని, ఒక్క దెబ్బకే ఆ అర్భకుడు మరణించాడు. శత్రువులు తనను చంపాలని పథకాలను పన్నుతున్నప్పుడు ఆయన తప్పించుకుని అక్కడికి చేరారు.

హజ్రత్ షుఐబ్ (అస), హజ్రత్ మూసా (అస)కు ధైర్యాన్నిచ్చారు. పెద్ద కూతురు బీబీ సఫూరాను ఆయనకిచ్చి వివాహం చేయ సంకల్పించారు. అయితే అందుకు ప్రతిగా హజ్రత్ మూసా (అస) ఎనిమిది లేదా పది సంవత్సరాలపాటు తమ మేకలను మేపుకు రావలసి ఉంటుందని షరతు విధించారు. హజ్రత్ మూసా (అస) ఒప్పుకున్నారు. ఆ విధంగా బీబీ సఫూరా మెహర్ (స్త్రీ ధనం)లో నగలు, సంపద తీసుకునే బదులు తన తల్లిదండ్రులకు చేసే సేవకు అంగీకరించారు.

# సోదరునితో ప్రేమ

అన్నా చెల్లెళ్ళ ప్రేమ లోకవిదితమే. ఒక ఒడిలో పెరగడం, పెద్దవ్వడం, బాల్యం నుంచి ఒకటిగా ఉండటం, ఆడటం, పంచుకుని తినడం, త్రాగడం వల్ల వారిలో పరస్పర ప్రేమానురాగాలు జనిస్తాయి. కష్టసుఖాలను పంచుకోవ డానికి ప్రేరేపిస్తాయి. చిన్ననాటి ఈ ప్రేమానురాగాలు జీవితాంతం ఉంటాయి. అవసర మయితే పరులను ఆశ్చర్యపరిచే త్యాగాలు కూడా చేయిస్తుంది సోదర ప్రేమ.

అలాంటి ఓ చెల్లెలు, బావల కథ ఇది. ఆమెకు తన సోదరుడు జర్రార్ అంటే అమిత ప్రేమ. ఓసారి జర్రార్ శత్రు సైన్యంతో పోరాడుతుండగా ఓ పెద్ద గాయం అయ్యింది. అంతే కాదు, అతడు శత్రువులకు పట్టుబడ్డాడు.

హజ్రత్ ఖవ్‌లాకు సోదరుడు బందీ అయ్యాడన్న వార్త తెలియగానే ఆమె ఆందోళనతో తల్లడిల్లిపోయింది. ముస్లిమ్‌ల ప్రముఖ సైనిక నాయకుడు హజ్రత్ ఖాలిద్ (రజి), జర్రార్‌ను విడిపించడానికి వేయి మంది సైనికులను తీసుకుని బయలుదేరి వెళుతున్నారు. బీబీ ఖవ్‌లా కూడా ఆయుధాలు ధరించి వేగంగా ప్రయాణించే ఓ గుర్రంపై తన సోదరునికి మద్దతు కోసం సైన్యంతో బయలుదేరడానికి సిద్ధమై వచ్చింది.

బీబీ ఖవ్‌లా శరీరం యావత్తు కప్పుకుని ఉంది. కేవలం కళ్ళు మాత్రమే కనబడేలా వచ్చింది. తద్వారా ఎవరూ గుర్తించరాదన్న ఆమె ఉద్దేశ్యం నెరవేరింది. వేగంగా గుర్రం స్వారీ చేస్తూ వెళ్తున్న ఆ అశ్వికుడిని అందుకోవాలని వెనుకవాళ్ళు ప్రయత్నించారు. కాని బీబీ ఖవ్‌లా గుర్రం వేగాన్ని మరింత పెంచి ముందుకు దూసుకుపోయింది. ఈలోగా శత్రుసైన్యం ఎదురయ్యింది. బీబీ ఖవ్‌లా పిడుగులా శత్రుసైన్యంపై విరుచుకుపడి వారి యుద్ధపంక్తులు చిందర వందర చేసింది. ముస్లిమ్ సైనికులు కూడా ఈ క్రొత్త అశ్వికుడు ఎవరో? ఇంత

పరాక్రమాన్ని ప్రదర్శిస్తున్నాడని ఆశ్చర్యపోయారు. యుద్ధం ముగిసి విజయం ముస్లిమ్‌లను వరించింది. శత్రువులు పారిపోయారు.

అప్పుడు ముస్లిమ్‌ల సేనానాయకుడు హజ్రత్ ఖాలిద్ (రజి) విచారించగా ఆ క్రొత్త అశ్వికుడు బీబీ ఖవ్‌లా అని బయటపడింది. సోదరుని పట్ల గల ప్రేమ ఆమెను నిలువనీయలేదని సోదరుడిని బంధ విముక్తిగావించుటకు స్వయంగా ఆయుధం పట్టి వచ్చిందని తెలిసింది. చివరికి శత్రువులను ఓడించి హజ్రత్ జర్రార్‌ను విడిపించారు.

ఇలా ఇంకా అనేక సంఘటనలు జరిగాయి. సోదరుని కోసం ప్రాణాలతో చెలగాటమాడింది ఆ సోదరీమణి. శత్రువుల చేత చిక్కి ఉన్న సోదరిని విడిపించడానికి ప్రాణాలను తెగించాడు ఆ సోదరుడు. బీబీ ఖవ్‌లా, హజ్రత్ జర్రార్‌లు ఒకరి కోసం మరొకరు ప్రాణాలను సయితం లెక్కచెయ్యలేదు.

# ఉదార స్వభావం

దైవం చాలా ఉదారస్వభావుడు. తన ఆదేశాలను పాటించేవారికి, తిరస్కరించేవారికి అందరికీ ఆహారపానీయాలనిస్తున్నాడు. దైవం అత్యంత ఉదారుడు కనుక తన మార్గంలో విశాల హృదయంతో ఖర్చుపెట్టేవారంటే ఆయన ఇష్టపడతాడు. పిసినారితనం అంటే దైవానికి నచ్చదు.

దైవాన్ని ప్రేమించేవాళ్ళు ఉదార స్వభావం కలిగివుంటారు. అయితే ఈ విషయంలో బీబీ ఆయెషా (రజి) అందరికన్నా ముందున్నారు. ఆమెకు ఏది లభించినా దాన్ని ఆ రోజే దైవ మార్గాన ఖర్చుచేసేవారామె.

ఓసారి ఓ ప్రవక్త సహచరుడు (రజి) వచ్చాడు. ఆమె ఆ సహాబితో, "నా దగ్గర కనుక పదివేల దిర్హమ్‌లు ఉంటే నేను మీకు ఇచ్చేసి ఉండేదాన్ని" అన్నారు. యాదృచ్ఛికంగా ఆ రోజు ఆమె చేతిలో కొంత సొమ్ము వచ్చింది. ఆమె వెంటనే ఆ సహాబిని పిలిచి పది వేల దిర్హమ్‌లు ఇచ్చారు.

ఓసారి ఆమె (రజి) మేనల్లుడు హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి)కు ఓ లక్ష దిర్హమ్‌లు పంపారు. ఆ రోజు ఆమె ఉపవాసంతో ఉన్నారు. ఆ మొత్తం సొమ్మును ఆమె అదే రోజు పేదలకు పంచేశారు. కనీసం ఇఫ్తార్ (ఉపవాస విరమణ) కోసం కూడా ఏమీ తీసుకోలేదామె.

మరోసారి ఆమె ఉపవాసంతో ఉన్నప్పుడు ఇంటిలో ఇఫ్తార్ కోసం ఓ రొట్టె ముక్క తప్ప మరేమీ లేదు. ఇంతలో ఓ ఫకీరు ఇంటి ముందుకు వచ్చాడు. ఆమె ఆ రొట్టెను ఆ ఫకీరుకు ఇచ్చేశారు.

ఓసారి ఆమె డెబ్భయి వేల దిర్హమ్‌లను దానం చేశారు. నిజానికిస్వయంగా ఆమె పరిస్థితి అప్పుడు ఎలా ఉందంటే వస్త్రాలపై అనేక మాసికలు పడి ఉన్నాయి.

ఆమె ఎవరి కూతురు మరి. తన సర్వస్వాన్ని దైవ మార్గంలో ఖర్చుపెట్టిన తండ్రి కూతురామె. ఇంటిలో భార్యా పిల్లల కోసం ఏమయినా వదిలారా అనడిగితే, 'దైవం, దైవ ప్రవక్తల పట్ల ప్రేమను వదిలాను. అదే చాలు మాకు' అని బదులిచ్చిన తండ్రికి కుమార్తె ఆమె.

# అభిమానం

దైవం పట్ల భయభక్తులుగల మంచి అమ్మాయిలకు అభిమానం ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడయినా వారి అభిమానం దెబ్బతింటే తమ ప్రాణాల్ని సయితం లెక్కచెయ్యక ఆత్మాభిమానాన్ని కాపాడుకుంటారు.

ముస్లిమ్ దేశం టర్కీ పేరు మీరు వినే ఉంటారు. టర్కీ మన దేశానికి చాలా దూరాన ఉంది. పశ్చిమాన యూరప్‌తో కలిసి ఉంది. అక్కడి పాలకుల్లో అనేక బలహీనతలు చోటు చేసుకున్నాయి. అప్పుడు యూరప్‌వాళ్ళు దండయాత్ర చేసి ఆ దేశాన్ని ఆక్రమించుకోవాలనుకున్నారు.

ఓసారి శత్రువుల సైన్యమొకటి ఓ టర్కీ గ్రామంపై దాడి చేసింది. గ్రామంలోని మగవాళ్ళందరూ యుద్ధరంగంలో ఉన్నారు. ఆ ముష్కర మూక స్త్రీలను, పిల్లలను హత్యచేయడం మొదలుపెట్టింది. ఓ సైనికుడు ఓ ఇంటిలో దూరాడు. ఆ ఇంటి ఇల్లాలు ప్రసవించి ఉంది. పసిపిల్లవాడు తల్లి వద్ద ఉన్నాడు. ఆ రాక్షసుడు ఇంటిలోకి దూరి తల్లి ప్రక్కన పడుకున్న పిల్లవాడిని లాగి హత్య చేశాడు. ఈ కిరాతక చర్యను చూసిన ఆ తల్లి దుఃఖం ఏమని వర్ణించగలం. అంతటి పైశాచానికి పాల్పడిన ఆ సైనికుడు ఆమెపై అత్యాచారానికి ఒడిగట్టాడు. "నిన్ను నా భార్యను చేసుకుంటాను" అన్నాడు. అప్పుడే హత మార్చిన ఆ తల్లి ముద్దుల బిడ్డడి ఆ శవం నెత్తుటి ముద్దయి అక్కడే పడి ఉంది. పైగా ఈ మాటలు విన్న ఆ అభిమానధనురాలు అగ్గి మీద గుగ్గిలమయ్యింది. ఇంతటి అవమానాన్ని ఆమె భరించలేకపోయింది. అయినా కోపం దిగమ్రింగే అవకాశం కోసం ఎదురుచూడసాగింది. యాదృచ్ఛికంగా ఆ సైనికుడికి కాలకృత్యాలు తీర్చుకోవలసిన అవసరం వచ్చింది. ఆయుధాలు తీసి ప్రక్కనబెట్టి వెళ్ళాడు. వెంటనే ఆమె ఆ ఆయుధాన్ని తన చేతిలోకి తీసుకుంది. ఆ సైనికుడు తిరిగివచ్చిన వెంటనే దాడిచేసి హతమార్చింది. ఆ విధంగా తన అభిమానాన్ని కాపాడుకుంది.

# శౌర్యము

ప్రియప్రవక్త (స) బాబాయి హజ్రత్ హమ్‌జా (రజి) అని ఉండేవారు. ఆయన చాలా బలవంతుడు, శౌర్యశాలి. ఆయన పేరు వింటే పెద్ద పెద్ద పహిల్వానులు గడగడలాడేవారు. హజ్రత్ హమ్‌జా (రజి)కు ఓ సోదరి ఉండేవారు. ఆమె పేరు బీబీ సఫియా (రజి). ఆమె ప్రియప్రవక్త (స)కు మేనత్త. బీబీ సఫియా (రజి) సయితం తన సోదరుని వలె చాలా ధైర్యంగల స్త్రీ.

ఓసారి ఏమయ్యిందంటే, మక్కాలోని అవిశ్వాసులు మదీనాపై దాడి చేశారు. మదీనా చుట్టుప్రక్కలా యూదులు ఉండేవాళ్ళు. ముస్లిమ్‌లతో వాళ్ళకు ఒప్పందం ఉంది. అయినా ఆ దుష్టులు సయితం అవిశ్వాసులతో కలసిపోయారు. అవిశ్వాసులతో కలిసి వాళ్ళు కూడా ముస్లిమ్‌లపై దాడి చేశారు.

ప్రియప్రవక్త (స) మగవారిని వెంటబెట్టుకుని శత్రువుల నెదుర్కోడానికి వెళ్ళారు. స్త్రీలను, పిల్లలను ఓ కోటలో ఉంచి కోట రక్షణ భారాన్ని ఓ వ్యక్తిపై వేసి వెళ్ళారు. స్త్రీలు ఒంటరిగా ఉండివుంటారనుకుని యూదులు ఓ సైనిక బృందాన్ని కోటపై దాడి చేయడానికి పంపారు. ఆ సైనిక బృందం కోట గోడ వద్ద శిబిరాన్ని వేసింది. కోటలో కేవలం స్త్రీలు మాత్రమే ఉన్నారా లేక పురుషులు కూడా ఉన్నారా అన్నది తెలుసుకోవడానికి ఓ గూఢచారిని పంపారు. బీబీ సఫియా(రజి) ఆ గూఢ చారిని పసిగట్టారు. కోట రక్షణ భారం వహించిన వ్యక్తితో వెంటనే ఆ యూదుడిపై దాడి చేయమని చెప్పారు. కాని ఆ పెద్ద మనిషి, "నాలో అంత శక్తి ఉంటే యుద్ధ రంగానికే వెళ్ళేవాడిని, ఇక్కడ స్త్రీలకు కాపలాగా కూర్చుండేవాడినా!" అంటూ ఊరుకున్నాడు. ఈ మాటలు విని బీబీ సఫియా(రజి) స్వయంగా ఓ కర్రను చేతిలోకి తీసుకుని ఆ యూదుడిపై హఠాత్తుగా దాడిచేసి తలపై బలంగామోదారు. ఎంత బలంగా దెబ్బ పడిందంటే, ఆ దెబ్బకు యూదుడు తల పగిలి చచ్చిపోయాడు.

ఆ తరువాత కోట సంరక్షకుని వద్దకు వెళ్ళి ఆ యూదుడి పని సమాప్తం చేశానని, కాని అతను మగవాడు గనుక తాను తాకలేనని, కాబట్టి మీరు వెళ్ళి వాడి తల నరికి బయటపడేయండి. తద్వారా బయట ఉన్న సైనికులు భయపడి పారిపోతారు అని చెప్పింది. కాని, ఆ పెద్ద మనిషి వల్ల ఆ పనీ జరుగ లేదు. చివరికి తప్పదు అనుకుని బీబీ సఫియా (రజి) స్వయంగా ఆ గూఢచారి తల నరికి కోట వెలుపలికి విసిరేశారు. బయట ఉన్న యూదు సైనికులు తమ తోటివాని తలను చూడగానే కోట లోపల పురుషులు కూడా ఉన్నారని భయపడి పారిపోయారు.

# పట్టుదల

మౌలానా మౌదూది పేరు మీరు వినే ఉంటారు. ఆయన ఇటీవలి కాలంలోని ఓ పెద్ద ధర్మవేత్త. దైవం ఆయనకు మంచి మేధాశక్తిని ఇచ్చాడు. ఆయన మనస్సులో ధర్మం పట్ల ఎనలేని చింత ఉంది. ఆయన ఎల్లప్పుడు దేవుని ఈ భూమిపై దేవుని ధర్మం ఎలా ప్రచారం చేయాలా అని ఆలోచిస్తూ ఉండేవారు. దైవ సృష్టి అయిన ఈ మనుష్యులకు ఎలా నచ్చజెప్పి దైవ మార్గాన నడపాలా అని యోచిస్తూ ఉండేవారు. ప్రపంచంలో దైవప్రవక్తలు ఎప్పటినుంచో చేస్తూవస్తున్న ధర్మబోధలే ఆయన చెప్పేవారు. ప్రవక్తల పరంపరలో ఆఖరి ప్రవక్త (స) తీసుకుని వచ్చిన సంపూర్ణ ధర్మాన్ని గురించి తెలుసుకున్న ప్రతి మనిషి ఆ ధర్మాన్ని అనుసరించితీరుతాడు. మౌలానా, ప్రవక్త (స) బోధనలతో సందేశ ప్రచారం చేశారు. క్రమేణా ప్రపంచంలోని అనేక దేశాలలోని ప్రజలు ఆయన మాటలను విని పాటిస్తూ ఆయన వెంట నడిచారు. ఆయన ఓ మంచి వ్యక్తుల సంఘాన్ని స్థాపించారు. దైవ ధర్మాన్ని దేవుని భూమిపై నెలకొల్పే ప్రయత్నం చేస్తుంది ఆ సంఘం.

మనుష్యులను తమ కనుసైగలతో పాలించాలనుకునేవారికి మౌలనా మాటలు నచ్చేవి కావు. దైవమిచ్చిన రాజ్యాధికారాన్ని దేవుని అమానతు అని తలచక, తమ తాతముత్తాతల జాగీరుగా భావించేవారికి మౌలానా మాటలు నచ్చలేదు. ఇలాంటివాళ్ళు మౌలానా మార్గాన ఆటంకాలు కల్పించసాగారు. అబద్ధపు ఆరోపణలు చేస్తూ మౌలానాను వేధించేవాళ్ళు. కాని మౌలానాకు దైవం సహనాన్ని, సంయమనాన్ని, పట్టుదలను అమితంగా ప్రసాదించాడు. అందువల్ల స్వార్థపరులు ఆయనను ఎంత ఎక్కువగా వ్యతిరేకిస్తే అంతగా ఆయన విశ్వాసం పెరిగేది. ఓసారి ఆ దుష్టులు ఓ అబద్ధపు కేసులో ఇరికించి, మౌలానాకు ఉరిశిక్ష విధించేశారు కూడా. శిక్ష గురించిన వార్త రేడియో ద్వారా దేశ దేశాలకు వ్యాపించింది. మౌలానా ఉరిశిక్ష పడ్డ ఖైదీగా జైలులో, "దైవం నా ప్రయత్నాలు మన్నించి ధర్మయుద్ధ మరణం (షహాదత్) ప్రసాదించాడు"

అనుకుని హాయిగా పడుకున్నారు. కాని ఉరిశిక్ష గురించి తెలుసుకున్న ప్రతి పౌరుడు దుఃఖంలో మునిగిపోయాడు. పాపం, ఆయన చేసిన నేరం ఏమిటి? అని అందరూ ఆలోచించసాగారు. దైవధర్మం వైపు దేవుని సృష్టి అయిన మనుష్యులను ఆహ్వానించడం ముస్లిమ్ దేశాలలో అంత కఠినతరమైపోయిందా? ఫలితంగా ఉరిశిక్ష పడుతుందా? పాపం మౌలానా ఎవరినీ ఏదీ అడగరు. అందరి మంచి కోసం రాత్రింబవళ్ళు కష్టపడతారు. సమాజం ఇంతగా దిగజారిపోయిందా? మంచివారిని అస్సలు భరించలేని స్థితికి వచ్చిందా?

మౌలానా ఉరిశిక్ష గురించి ఆయన సతీమణికి కూడా తెలిసింది. ఆమె ఎంతటి దుఃఖాన్ని భరించి ఉంటుందో మీరే ఆలోచించండి. కాని, ఆమె ఓ ఉత్తమ మహిళ. కొంతసేపటి వరకు ఆందోళనతో అలమటించి మనస్సులో అనుకున్నారు- దైవధర్మ స్థాపనలో మౌలానా రక్తం అవసరమయితే దేవుని ఈ నిర్ణయాన్ని మనం ఒప్పుకోవాలి. కాని, దైవం ఆయన్ను సజీవంగా ఉంచాలని తలిస్తే ఎవ్వరూ ఆయనను ఏమీ చేయలేరు.

అల్లాహ్ ఆయన పట్టుదల, సహనాలకు బదులుగా ఏమిచ్చాడో తెలుసా? రెండో రోజున రేడియో ద్వారా మౌలానాకు పడిన ఉరిశిక్ష రద్దు అయినట్లు ప్రకటిం చారు. ఆయన జైలు నుంచి విడుదలై తన భార్యాపిల్లలను కలుసుకున్నారు. దైవ ధర్మ స్థాపన కోసం పూర్తి శక్తియుక్తులు వినియోగించి జీవితాంతం శ్రమించారాయన.

# సహనం

సహనం చూపితే ప్రతిఫలం తీయగా ఉంటుంది అన్నది ఓ వాస్తవం. ఈ వాస్తవంపై నమ్మకమున్న అమ్మాయిలు ఎప్పుడూ సంతోషంతో ఉంటారు. మీరే ఆలోచించండి. ఎలాంటి బాధలు, కష్టాలు లేని మనిషంటూ ఎవరన్నా ఉన్నారా? అందరి ఇళ్ళలోనూ ఎప్పుడో ఒకప్పుడు మరణాలు సంభవిస్తూ ఉంటాయి. ధన ప్రాణ నష్టాలు సంభవిస్తాయి. అగ్ని ప్రమాదం, వ్యాపారాల్లో

నష్టం, పంటలు నాశనమవ్వడం, దొంగతనం జరగడం, విలువయిన వస్తువుల్ని పోగొట్టుకోవడం- ఇలా ఏదో ఓ కష్టం రావచ్చు. బాధపడడం వల్ల, ఏడుస్తూ కూర్చోవడం వల్ల ఆ కష్టం తీరదని, ఆ నష్టం పూడ్చుకోదని మనకు తెలుసు. అనవసరంగా విలువయిన కాలం గడిచిపోతుంది. ఆరోగ్యం దెబ్బతింటుంది. నిరాశానిస్పృహలు అలుముకుంటాయి. మన దగ్గర ఉన్న ఏ చిన్న, పెద్ద వస్తువయినా, సంపదయినా అది అల్లాహ్ ఇచ్చిన అమానత్ (తిరిగి ఆయన కోరినపుడు తీసుకునేది) అని భావిస్తే, ఆయన మనపట్ల అంతులేని ప్రేమగలవాడని, మనకు ఏదన్నా వస్తువు అవసరమయితే, దానితో మనకు ప్రయోజనముందని దైవం తలిస్తే ఆ వస్తువును ఆయన వెంటనే మనకు ఇస్తాడనీ, మనకు అక్కరలేదని ఆయన భావిస్తే తిరిగి తీసుకుంటాడని మనం తెలుసుకోవాలి. అప్పుడు పెద్ద పెద్ద కష్టాలు విరుచుకుపడినా మనకు ఎలాంటి ఆందోళనా కలుగదు. 'ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్' అని చదువుకుంటే మనస్సు వెంటనే కుదుటపడుతుంది. దైవం పోయిన వస్తువులకు బదులుగా, అంతకన్నా విలువైనవాటిని ప్రసాదిస్తాడు. అల్లాహ్ ఖజానాలో ఏ వస్తువుకూ కొరత లేదు.

సహనం, కృతజ్ఞతా గుణాలను చూపిన మహిళలు అనేక మంది ఉన్నారు. దైవం వారి సహనానికి బదులు మంచి ప్రతిఫలాన్నిచ్చాడు. అలాంటి ఓ పుణ్య స్త్రీ బీబీ ఉమ్మె సలీమ్ (రజి). ఆమె భర్త పేరు అబూ తల్హా (రజి), వీరు ప్రియప్రవక్త (స) సహచరులు, బీబీ ఉమ్మె సలీమ్‌కు ఓ ముద్దొచ్చే పిల్లవాడు ఉండేవాడు. తల్లిదండ్రులకు ఆ పిల్లవానిపై అమిత ప్రేమా, వాత్సల్యాలుండేవి. స్వయంగా ప్రియప్రవక్త(స), తల్హా(రజి) ఇంటికి అప్పుడప్పుడు వెళ్ళి ఆ పిల్లవానితో మాటలాడి, ఆ ముద్దుల మాటలకు ఆనందించేవారు.

ఆ పిల్లవానికి అకస్మాత్తుగా జబ్బు చేసింది. క్రమేణా కృశించిపోయాడు.

ఓ రోజు ఏదో అవసర పనిపై అబూ తల్హా (రజి) వెళ్ళవలసివచ్చింది. యాదృచ్ఛికంగా అదే రోజు పిల్లవాడు మరణించాడు. తల్లికి అంతులేని దుఃఖం కలిగింది. సహజమే కదా! అయినా ఆ పుణ్యస్త్రీ 'ఇన్నాలిల్లాహ్' అని చదివి గుండె దిటవు చేసుకుని సహనం వహించింది. అబూ తల్హా (రజి) వస్తే ఏమీ చెప్పవద్దని ఇంటిలోనివారికి ముందే చెప్పింది. పిల్లవాని శవాన్ని ఓ గుడ్డలో చుట్టి ఉంచింది. ఇంటి పనిలో మునిగిపోయింది.

హజ్రత్ అబూ తల్హా (రజి) ఇంటికి వచ్చి పిల్లవాని గురించి అడిగారు. ఆమె గడబిడగా సరియైన జవాబు చెప్పకుండా దాటవేశారు. భర్త భోజనం చేసి, కొంతసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత భార్య చెప్పింది.

"ఏమండి! ఎవరన్నా ఎవరి వద్ద నుంచైనా ఓ వస్తువును అడిగి తెచ్చుకున్నాడనుకోండి. ఆ యజమాని మళ్ళీ ఆ వస్తువును అడిగినప్పుడు ఏం చేయాలి?" అనడిగింది.

భర్త : ఎవరి వస్తువు వారికి సంతోషంగా ఇచ్చేయాలి.

భార్య: అయితే సహనం వహించండి. మన ముద్దుల బిడ్డ అల్లాహ్ అమానత్‌గా వచ్చాడు. అల్లాహ్ తిరిగి తీసుకున్నాడు.

భర్త కూడా ప్రవక్త (స) సహచరులు మరి. సహనం చూపారు. మరునాడు హుజూర్ (స) సన్నిధిలో హాజరై యావత్ సంఘటనను వినిపించారు. ఆ భార్యాభర్తలు చూపిన సహనాన్ని ప్రవక్త (స) చాలా మెచ్చుకున్నారు. ఆ దంపతుల కోసం దైవాన్ని ప్రార్థించారు. కొద్ది రోజుల తరువాత హజ్రత్ అబూ తల్హా (రజి) ఇంట మరో పిల్లవాడు పుట్టాడు. ఆ పిల్లవానికి అబ్దుల్లాహ్ అని పేరు పెట్టారు. ఈ అబ్దుల్లాహ్ పెరిగి పెద్దయి ప్రముఖ ధర్మవేత్తగా పేరుపొంది తల్లిదండ్రులకుపేరు తెచ్చాడు. అల్లాహ్ ఆ తల్లిదండ్రులు చూపిన సహనానికి మంచి ప్రతిఫలమిచ్చాడు.

# ఒట్టు పెట్టడం తగదు

మాటిమాటికి ఒట్లు పెట్టడం మంచి అలవాటు కాదు. ఒట్టు పెట్టి దాన్ని విస్మరించడం మరింత చెడ్డ పని. ఒట్లు పెట్టేవానిపై నమ్మకంపోతుంది. ఒట్లు పెట్టి విస్మరిస్తే తగు పరిహారం చెల్లించవలసి ఉంటుంది. మంచి అమ్మాయిలు ఒట్లు పెట్టరు. ఒకవేళ ఎప్పుడన్నా ఒట్టు పెట్టినా అది పూర్తి చేస్తారు.

బీబీ ఆయెషా (రజి)కు ఓ మేనల్లుడు ఉండేవారు. ఆయన పేరు హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి). బీబీ ఆయెషా (రజి) ఆయన్ను పెంచి పెద్దచేశారు. హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) ఆమెను తల్లితో సమానంగా ప్రేమించేవారు. బీబీ ఆయెషా (రజి) గురించి మీకు తెలుసు కదా. ఆమె చాలా ఔదార్యం గల మహిళ. స్వయంగా కష్టాలనుభవిస్తూ తనకు లభించినదంతా పేదలకు పంచిపెట్టేవారు. ఆమెను కష్టాల్లో చూసి హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) చాలా బాధపడేవారు.

ఓసారి హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) తన పినతల్లి చేతికి ఎముక లేదని, ఎలాగయినా ఆమెను ఆపాలని అనేశారు. అంత ఔదార్యం- అంటే స్వయంగా ఆకలితో అలమటిస్తూ ఇతరులకు దానధర్మాలు చేయడం మంచిది కాదన్నారు. ఈ విషయం బీబీ ఆయెషా (రజి)కు తెలిసింది. ఆమెకు అబ్దుల్లాహ్ (రజి)పై చాలా కోపం వచ్చింది. మాట్లాడరాదని ఒట్టు పెట్టుకున్నారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి)కు ఆమె కోపం తెలిసి చాలా బాధపడ్డారు. అనేక మందితో ఆయన సిఫారసు చేయించుకున్నారు. కాని, బీబీ ఆయెషా (రజి) ఒట్టును పాటిస్తూ ఎవరి మాటలను అంగీకరించలేదు. హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) చాలా ఆందోళనతో హుజూర్ (స) తాతగారి ఇంటి నుంచి రెండు సిఫారసులను తీసుకుని ఆమె వద్దకు వచ్చారు. బీబీ ఆయెషా (రజి) పరదా

వెనుక నుంచి మాట్లాడసాగారు. హ(జత్ అబ్దుల్లాహ్(రజి) వెంటనే లోపలికి దూరిపోయి,ఏడుస్తూ క్షమాపణను అర్థించారు. సిఫారసు కోసం వచ్చినవాళ్ళు కూడా 'మాట్లాడకూడదన్న' ఆమె నిర్ణయంపై హుజూర్ (స) ఆదేశాలను వినిపించారు. "ఓ ముస్లిమ్ మరో ముస్లిమ్‌తో మూడు రోజులకు మించి మాట్లాడకుండా ఉండరాదు." ఈ ఆదేశం విని బీబీ ఆయెషా (రజి) దుఃఖించారు. హ(జత్ అబ్దుల్లాహ్ (రజి)ను క్షమించి, ఆయనతో మళ్ళీ మాట్లాడటం ప్రారంభించారు. కాని ఆ ఒట్టుకు పరిహారంగా అనేక మంది బానిసలకు స్వేచ్ఛనిచ్చారు. నలభై మంది బానిసలు స్వేచ్ఛ పొందారు. అయినా ఎప్పుడైనా ఒట్టుపెట్టిన విషయం గుర్తుకువస్తే చాలా దుఃఖించేవారు. ఎంతగా దుఃఖించేవారంటే ఆమె దుప్పటి కన్నీళ్ళతో తడిసి పోయేది.

# సత్యవాది

దైవం అందరినీ పుట్టించాడు. అందరికీ ప్రభువు, స్వామి ఆ దైవమే. ఆ దైవమిచ్చినదే అందరూ తింటున్నారు. అందువల్ల అందరూ ఆ దైవానికి దాసులు, బానిసలు. అందరికీ పాలకుడు, రారాజు ఆ దైవం.

దైవ సామ్రాజ్యం చాలా పెద్దది. తన సామ్రాజ్యంలోని ఓ చిన్న భాగం-భూమిపైన మనల్ని అంటే మనుష్యులను పుట్టించాడు. నా భూమిపై కేవలం నా ఆదేశాలు చెల్లుతాయని, మనుష్యులందరూ నన్ను రారాజుగా భావించి, నా ఇష్టానుసారం జీవించాలని తన ప్రవక్తల ద్వారా సందేశాన్ని పంపాడు.

నలుగురు ఖలీఫాలు ఈ వాస్తవాన్ని బాగా గుర్తించారు. అందుకే వాళ్ళు దైవ ఇష్టానికి అనుగుణంగా నడుచుకునేవారు. ముస్లిములందరిని దైవాదేశాలకు అనుగుణంగా నడిపేవారు. కాని, తరువాత, తరువాత అజ్ఞాన జాతుల ప్రభావం వల్ల ముస్లిములలోనూ 'రాజరికం' అన్న ఆచారం మొదలయ్యింది

దైవానికి బదులు తామే స్వయంగా రాజులై కూర్చున్నారు. ప్రజలను బలవంతపెట్టి తమ తమ ఇష్టాయిష్టాలపై నడిపించసాగారు.

బైతుల్‌మాల్ అంటే ప్రజాధనాన్ని తమ సొంత సౌఖ్యాలకు విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ భోగాల్లో మునిగిపోయారు. తమ ఇంటివారికి, వారసులకు పెద్ద పెద్ద పదవులు కట్టబెట్టారు. తమవాడు ఎంత అసమర్థుడయినా హోదా ఇచ్చి గౌరవించసాగారు. ఫలితంగా న్యాయం, ధర్మం నశించసాగాయి. ప్రజలపై అత్యాచారాలు పెరిగాయి. దైవద్రోహానికి పాల్పడిన ఈ రాజులు స్వయంగా పతనమవ్వడమే కాదు, ప్రజల్ని కూడా నాశనం చేయసాగారు.

ఈ సర్వనాశనాన్ని ఆపడానికి ప్రయత్నించినవాళ్ళను లేదా చెడు పనులను ఖండించినవాళ్ళను శత్రువులుగా పరిగణించి, అబద్ధపు ఆరోపణలు వేసి హత్య చేయించేవారు. ప్రతి కాలంలోనూ ఈ మూర్ఖ పాలకులు ఎంత మంది దైవదాసుల రక్తంతో జలకాలాడారో లెక్క లేదు. ముస్లిమ్ సమాజాన్ని మంచి వ్యక్తుల సేవలు పొందకుండా నిరోధించారు. ఇలాటి దుష్టులలోకెల్లా దుర్మార్గుడు 'హజ్జాజ్.'

అయినా ప్రతి యుగంలోనూ దైవ కృపవల్ల మంచిని పెంచే దైవదాసులు పుడుతూ వచ్చారు. తమ ప్రాణాలను లెక్కచెయ్యక రాజుల అత్యాచారాలను ఖండించారు. మగవాళ్ళే కాదు, ఆడవారు సయితం ఎదిరించి నిలిచారు.

బీబీ ఆయెషా (రజి) మేనల్లుడు హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి) గురించి మీకు తెలుసు. ఆయన తల్లి పేరు బీబీ అస్మా (రజి). నలుగురు ఖలీఫాల తరువాత ముస్లిమ్ సమాజంలో 'రాజరికం' అన్న తప్పుడు పద్ధతి మొదలైనపుడు, ఆ పద్ధతిని వ్యతిరేకించిన వారిలో ఆయన ఒకరు. ఆయన తీవ్రంగా ప్రయత్నించి అరబ్‌లో ఖిలాఫత్‌ను మళ్ళీ స్థాపించారు. దాదాపు ఆరు, ఏడు సంవత్సరాల వరకు ఖలీఫాగా ఉన్నారు. చివరికి ఓ ముస్లిమ్ రాజు తన మంత్రి 'హజ్జాజ్'ను పంపి ఆయన్ను హత్య చేయించాడు. హజ్జాజ్ ఆయన్ను హత్య చేసి ఆ శవాన్ని ఓ కొండపై వ్రేలాడదీశాడు. ఆ తరువాత బీబీ అస్మా (రజి) వద్దకు

వెళ్ళి, హజ్రత్ అబ్దుల్లాహ్ (రజి)ను (తౌబా, తౌబా) ధర్మభ్రష్టుడనీ, ద్రోహి అని ఆరోపించాడు. బీబీ అస్మా (రజి) ఈ అవాకులు చవాకులను భరించలేకపోయారు.

'నా కుమారుడు ధర్మభ్రష్టుడు కాదు, ధర్మనిష్ఠాపరుడు. తన తల్లి మాటను జవదాటనివాడు. హుజూర్ (స) చెప్పగా నేను విన్నాను. మా వంశంలో ఇద్దరు దజ్జాల్‌లు పుడతారని ప్రవక్త(స) చెప్పారు. అందులో రెండవవాడు మరింత దుష్టుడు. ఒక దజ్జాల్ పుట్టిపోయాడు. రెండవ దజ్జాల్ ఇక్కడ ఉన్నాడు' అని జవాబిచ్చారు.

ఈ చెంపపెట్టులాటి జవాబు విని హజ్జాజ్ నోట మాట వెలువడలేదు. అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. తన స్థావరానికి వెళ్ళి, "బీబీ అస్మా (రజి) శవం కావాలని అడగడానికి రానంత కాలం ఆ శవాన్ని అలాగే వ్రేలాడదీసి ఉంచుతాన"ని కబురు పంపాడు. అది విని అస్మా (రజి):

"నా కుమారుడు వాహనం దిగే సమయం ఇంకా రాలేదా?" అన్నారు. హజ్జాజ్‌కు ఈ జవాబు తెలియగానే, వెంటనే శవాన్ని దింపి ఇచ్చేశాడు. అబ్దుల్లాహ్ (రజి) అంత్యక్రియలు జరిగాయి.

# తరగని సంపద

మస్జిద్‌లు కట్టడం, మదరస (పాఠశాలలు) నిర్మించడం, బావులు త్రవ్వించడం, కాలువలు త్రవ్వించడం, రోడ్లు , వంతెనలు కట్టించడం, చికిత్సకు, వైద్యం కోసం ఆసుపత్రులు నిర్మించడం ఇవన్నీ ప్రజాసేవా కార్యక్రమాలు. ఇవన్నీ దైవ ప్రీతి కోసం చేస్తే చాలా పుణ్యం లభిస్తుంది. ఎందుకంటే ఈ ధర్మకార్యాల వల్ల అనేక మంది లాభం పొందుతారు. అందు వల్ల కట్టించిన వ్యక్తికి పుణ్యం లభిస్తూనే ఉంటుంది. దైవమార్గంలో ఇలా చేసే ధర్మకార్యాలను 'ఎడతెగని పుణ్యం' (సద్ఖాయెజారియా) అంటారు.

హారూన్ రషీద్ చరిత్రలో ఓ ప్రసిద్ధ చక్రవర్తి. ఆయన భార్య పేరు

జుబేదా. ఆమె చిన్నప్పటి నుంచి చాలా చలాకీ అమ్మాయి. ఆమె తాతగారు మన్సూర్, మనుమరాలిని చాలా ప్రేమించేవారు. అందువల్ల ఆమెకు పెళ్ళి చేసి పంపడాన్ని ఆయన ఇష్టపడలేదు.

జుబేదాలో ప్రజలకు సేవ చేసే ఉత్సాహం ఉండేది. ఆమె దేశంలో వంతెనలు కట్టించారు. బావులు త్రవ్వించారు. రోడ్లు నిర్మించారు. ధర్మసత్రాలు కట్టించారు.

అరబ్బు దేశంలో నీటి కొరత తీవ్రంగా ఉంటుంది. ఈ రోజుల్లో ఆధునిక సదుపాయాలతో ఏర్పాట్లు జరిగినప్పటికీ, జుబేదా కాలంలో హజ్ యాత్రికులు నీటి కోసం అనేక కష్టాలు పడేవారు. ఓసారి జుబేదా హజ్ చేయడానికి వెళ్ళారు. యాదృచ్ఛికంగా ఆ ఏడు నీటి కొరత మరింత తీవ్రంగా ఉంది. ఓ చెంబుడు నీళ్ళు ఒక్క అష్రఫీ ఇచ్చి కొనుక్కోవలసి వచ్చింది. ఈ పరిస్థితి చూసి జుబేదా చాలా బాధపడ్డారు. ప్రజలను ఈ కష్టం నుంచి కాపాడాలని నిర్ణయించిందామె. ముందుగా జమ్‌జమ్ జలాశయాన్ని బాగుచేయించారు. దాంతో మక్కా వాసులకు నీటి కొరత తీరింది. మక్కా నుంచి మదీనా వరకు గల దారిలో యాత్రికుల బృందాలు విడిది చేసే ప్రతిచోట బావులు త్రవ్వించారు. వసతి సౌకర్యాలు కల్పించారు.

జుబేదా అంతటితో ఆగలేదు. మక్కావాసులకు నిరంతరం నీళ్ళు అందు బాటులో ఉండే ఏర్పాటు చేయాలని తలపెట్టారు. పెద్ద పెద్ద ఇంజినీర్లను పిలిచి సలహా సంప్రతింపులు చేశారు. ఇంజినీర్లు సర్వే చేసి మక్కా నగరానికి యాభై మైళ్ళ దూరంలో ఓ నీటి చలమ ఉందని, అక్కడి నుంచి కాలువ ద్వారా మక్కాకు నీటిని తీసుకురావచ్చని సూచించారు. కాని కాలువ త్రవ్వడం అంత తేలిక కాదు. దారిలో కొండ గుట్టలు చాలా ఉన్నాయి. వాటిని త్రవ్వి కాలువ నిర్మించాల్సి ఉంటుంది. అందుకు చాలా కష్టపడాలి. చాలా ఖర్చవుతుంది కూడాను.

అది విని జుబేదా, "ఖర్చు గురించి ఆలోచించవద్దు. ఒక ఘనపుటడుగు త్రవ్వడానికి కూలి, ఒక అష్రఫ్ అయినా సరే నేను ఇవ్వడానికి తయారుగా ఉన్నాను" అన్నారు.

రాణిగారి ఆజ్ఞతో పని ప్రారంభమయ్యింది. ఇంజినీర్లు ఖర్చు లెక్కలను చూపించినపుడు జుబేదా ఆ కాగితాలను సముద్రంలో పారవేయిస్తూ, "ఇక్కడ ఖర్చు లెక్కల  అవసరం ఏముంది. మేము పనిని దైవం కోసం చేశాం. మీకు ఎంత రావలసి ఉందో తీసుకోండి. మీరు మాకు ఇవ్వవలసి ఉంటే మేం ఆ బాకీని రద్దు చేస్తున్నాం."

ఈనాటికీ మక్కా, దాని పరిసర ప్రాంతాల్లో జుబేదా కాలువ ఉంది. పన్నెండు వందల సంవత్సరాల దీర్ఘకాలంలో ఆ కాలువ ద్వారా లాభం పొందిన వాళ్ళందరూ బహుశ మనస్సులో జుబేదా కోసం దైవాన్ని ప్రార్థించి ఉంటారు.

# నచ్చిన సంబంధం

నచ్చిన సంబంధం లభించడం కూడా దేవుని వరప్రసాదమే. దంపతులు తమ హక్కులను, బాధ్యతలను గుర్తిస్తే, ఒకరి ఇష్టాన్ని మరొకరు మన్నిస్తే, ఒండొకరుల ఆలోచనలను, భావాలను గౌరవిస్తే జీవితం సుఖసంతోషాల నిలయంగా మారుతుంది. లేకపోతే ఒక్కో క్షణం యుగంలా గడుస్తుంది.

ఖాజి షరీఫ్, ఈయన ముస్లిమ్‌లలో ఓ చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఖాజి (జడ్జి లేక న్యాయమూర్తి). హజ్రత్ ఉమర్ (రజి) కాలంలో ఈయన పని చేశారు. డెబ్భయి సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ ఖాజీగా ఉన్నారు. ఆయన న్యాయశీలత, వివాద పరిష్కార శైలి చాలా ప్రసిద్ధిగాంచాయి. ఎంత క్లిష్ట వివాదమయినా ఆయన సునాయాసంగా దాని కారణాల్ని గ్రహించేవారు. సరియైన తీర్పునిచ్చేవారు. ఆయన భార్య పేరు జైనబ్. ఆమె సుగుణాల రాశి. భర్తకు

నచ్చని ఏ పనినీ ఆమె ఎన్నడూ చేయలేదు. అందువల్లనే ఖాజిగారు ఆమెతో ఆనంద ప్రదమయిన జీవితం గడిపేవారు. ఆయన ఆమెతో కఠినంగా వ్యవహరించే అవసరం రాలేదు. అసలు కఠినంగా అనేమిటి, విసుక్కునే పరిస్థితి కూడా ఎన్నడూ కలుగలేదు.

పెండ్లి తరువాత పుట్టిల్లు విడిచివచ్చిన జైనబ్, ఆమె భర్త ఇంటికి వచ్చిన తరువాత వాళ్ళిద్దరూ అంటే జైనబ్, ఖాజీగారు ఇద్దరూ రెండేసి రకాతుల నమాజు చదివి దైవానికి కృతజ్ఞతలు తెలిపారు. సంతోషాన్ని, సౌభాగ్యాన్ని ప్రసాదించమని దైవాన్ని వేడుకున్నారు. ఆ తరువాత జైనబ్ భర్తతో అంది-

"నాకు మీరు క్రొత్త. మీ అలవాట్లు, మీ పద్ధతులు నాకు తెలియవు. అందువల్ల ముందు నాకు మీ ఇష్టాలేమిటో చెప్పండి. అయిష్టాలేవో తెలుపండి. ఎందుకంటే, అవి తెలిస్తే నేను మీ ఇష్టాలను తెలుసుకుని, అయిష్టాలకు దూరంగా ఉండగలను."

అప్పుడామె భర్త తన ఇష్టాయిష్టాలను గురించి వివరంగా చెప్పారు. అప్పుడు జైనబ్ మళ్ళీ అడిగింది-

'నా పుట్టింటివాళ్ళు ఇక్కడికి వచ్చిపోవడం మీకు నచ్చుతుందా? లేదా?'

భర్త: "నేను ఖాజీని. అందువల్ల నా బాధ్యతల దృష్ట్యా వాళ్ళు రాకపోవడమే మంచిది."

అలా జైనబ్ మొదటి పరిచయంలోనే అన్ని విషయాలు తెలుసుకుంది. అంతే, ఇక జీవితాంతం ఎన్నడూ ఆక్షేపించే అవకాశాన్ని ఇవ్వలేదు.

జైనబ్ అమ్మగారు సంవత్సరంలో ఓసారి వచ్చేవారు. కూతురికి జాగ్రత్తలు చెప్పేవారు. భర్తను సంతోషపరచాలని హితం చెప్పేవారు. ఖాజీగారితోనూ తన కూతురి గురించి అడిగేవారు. అప్పుడుగాని సంతృప్తిచెందేవారు కాదు.

జైనబ్ అమ్మగారు మొదటిసారి తన కూతురి గురించి ఖాజీగారిని

అడిగినపుడు ఆయన ఆమెను చాలా పొగిడారు. అప్పుడు జైనబ్ అమ్మగారు ఏమన్నారంటే-

"ఆడవారి నైతికత రెండు పరిస్థితుల్లో దిగజారుతుంది. తన భర్త ప్రేమను మరీ ఎక్కువగా పొందినపుడు, తనకు పిల్లలు పుట్టిన తరువాత. జైనబ్ ఏదన్నా తప్పు చేస్తే కఠినంగా వ్యవహరించండి. ఎందుకంటే, తలబిరుసు, అహంభావి అయిన ఆడదాన్ని భార్యగా పొందడంకన్నా దురదృష్టం మరేదీ ఉండదు."

అత్తగారి ఈ మాటలకు ఖాజీగారు బదులిస్తూ, "మీరేమీ చింతించకండి. జైనబ్ సుగుణాలు నన్ను కఠినంగా వ్యవహరించే కష్టాన్ని ఇవ్వలేదు. ఆమె చాలా సంస్కారంగల, సఖ్యతగల స్త్రీ" అన్నారు.

ఆమె తల్లి హితబోధలు, జైనబ్ సుగుణాల వల్ల ఆమెను భర్త అమితంగా ప్రేమించేవాడు.

జైనబ్ పెళ్ళి చాలా సాదాసీదాగా జరిగింది.

బాజాభజంత్రీలు, గానాబజానాలు ఏవీలేవు. అనవసర ఆచారాలు, కట్నకానుకలు, సారెసామగ్రి కోసం కొట్లాటలు, పోట్లాటలు అంతకన్నా లేవు. మగపెళ్ళివాళ్ళం అన్న అహం భావం వాళ్ళనిగాని, ఆడపెళ్ళివాళ్ళం ఏం జరుగుతుందో అన్న వీళ్ళకిగాని లేకుండా జరిగింది పెళ్ళి. ఇలాటి పెళ్ళి చేయడం ఎంతో హాయిగా ఉంటుంది. అసలు ఇదంతా ఎలా జరిగిందంటే-

ఓసారి షురైహ్ ఎవరివో అంత్యక్రియలకు హాజరై వస్తున్నారు. దారిలో ఆయన తమియ్యం తెగవారి వీధి నుంచి వస్తుండగా ఆయనకు దాహం వేయసాగింది. యాదృచ్ఛికంగా అక్కడ ఎదురుగా కనబడిన జైనబ్ ఇంటివారితో త్రాగడానికి ఏమన్నా ఇవ్వమని అడిగారు. జైనబ్ అమ్మగారు చాలా మర్యాదగా మాట్లాడారు. పాలు తీసుకొచ్చి త్రాగడానికి ఇచ్చారు. మాటల్లో జైనబ్ ఇంకా కుమారి అని తెలిసింది. ఖాజీగారు 'నికాహ్' చేసుకుంటానని అన్నారు. జైనబ్

తల్లి అంగీకరించింది. జైనబ్ బాబాయిగారితో కలిసి మాట్లాడమని చెప్పిందావిడ. ఖాజీగారు కొంత మంది స్నేహితులతో సహా ఆయన్ను కలువడానికి వెళ్ళారు. అది అసర్ నమాజ్ సమయం. నమాజ్ తరువాత జైనబ్ బాబాయిగారితో మస్జిద్‌లోనే పరిచయమయ్యింది. మాటలు ముగిశాయి. ఆయన అంగీకరించారు.

"మీకన్నా యోగ్యుడు జైనబ్‌కు ఇంకెవరు దొరుకుతారు?" అన్నారాయన. అప్పటికప్పుడు మస్జిద్‌లోనే నికాహ్ జరిగిపోయింది. తమియ్యామ్ తెగలోని ఈ మంచి గుణాల వల్లనే ఆ తెగవారితో సంబంధ బాంధవ్యాలకు ప్రాధాన్యతనిచ్చేవారు ప్రజలు. ఖాజి షురైహ్ అయితే తన స్నేహితులతో పెళ్ళి చేసుకుంటే తమియ్యామ్ తెగ యువతులను చేసుకొమ్మని సలహా ఇచ్చేవారు. అప్పటి ప్రజలు ఎలాంటి సంబంధాలకు ఇష్టపడేవారో దీంతో అంచనా వేయవచ్చు.

# సంతానం పట్ల ప్రేమ

తల్లులందరూ తమ పిల్లల్ని అమితంగా ప్రేమిస్తుంటారు. పిల్లల కోసం అనేక బాధలను భరిస్తారు. తొమ్మిది మాసాలు మోస్తూ తిరుగుతారు. పురిటి నొప్పుల్ని భరించి జన్మనిస్తారు. రెండు సంవత్సరాలు వచ్చేవరకు తమ పాలిచ్చి సాకుతారు. చంకన మోస్తూ ఇంటి పని చేస్తుంటారు. పగలు విశ్రాంతికి, రాత్రి నిద్రకు దూరమై, కంటికి రెప్పలా చూస్తారు. మలమూత్రాలను శుభ్రపరుస్తారు. అన్నం తినిపిస్తారు. నీళ్ళు, పాలు త్రాగిస్తారు. స్నానం చేయించడం, ప్రేమతో అనేక విషయాలను నేర్పడం - ఇలా ఇంకెన్నో సేవలు చేస్తారు. పిల్లలు కాస్తంత జబ్బు పడితే చాలు, తల్లి పడే ఆందోళనను వర్ణించలేం. దైవాన్ని ప్రార్థిస్తారు, ఏడుస్తారు, తల్లడిల్లిపోతారు. మందులు మాకులు ఇస్తారు. పిల్లల కోసం తమ ధన ప్రాణాలను లెక్కచేయరు. తల్లికి పిల్లల పట్ల ఎంత ప్రేమ ఉంటుందో చూశారా. ఎంత సేవ చేస్తుందో చూశారా. అందుకే బుద్ధిమంతులయిన పిల్లలు తమకు తల్లి చేసిన మేలును ఎన్నడూ మరువరు.

హజ్రత్ మూసా (అస) పేరు మీరు వినే ఉంటారు. ఆయన ఓ ప్రముఖ ప్రవక్త. హజ్రత్ యాఖూబ్ (అస) సంతానాన్ని బనీ ఇస్రాయీల్ అంటారు. హజ్రత్ మూసా (అస) బనీ ఇస్రాయీల్ వంశానికి చెందినవారు. ఈజిప్ట్‌లో పుట్టారు. ఈజిప్ట్‌లో రాజులను ఫిరౌన్లు అని పిలిచేవారు అప్పుడు. హజ్రత్ మూసా (అస) కాలంలో ఫిరౌన్‌గా ఉన్నవాడు దైవద్రోహి, నిరంకుశుడయిన రాజు. ఆ దుష్ట రాజు బనీ ఇస్రాయీల్ వంశంలో మగ పిల్లవాడు పుడితే వెంటనే హత్య చేయించేవాడు. హజ్రత్ మూసా (అస) పుట్టినప్పుడు తల్లి చాలా ఆందోళన చెందారు. ఏ తల్లి అయినా తన ప్రాణప్రదమైన బిడ్డ హత్యను భరించ గలదా. మీరే ఆలోచించండి. తన ముద్దుల కొడుకు ప్రాణాన్ని ఎలా కాపాడాలా అన్న చింతలో మునిగిపోయారు హజ్రత్ మూసా (అస) తల్లి. ఏ దారీ కనబడ లేదు. ఆ కష్ట సమయంలో దైవ సహాయం లభించింది. కష్టాలలో ఆదుకునేవాడు పైవాడే కదా. దైవ కృప వల్ల ఆమెకో ఆలోచన తట్టింది. పిల్లవాడిని ఓ చెక్క పెట్టెలో పెట్టి, నైలు నదీ ప్రవాహంలో వదిలింది. "నీ పిల్లవానిని నీ దగ్గరకు మేము మళ్ళీ చేరుస్తాం-" అని ఆమె హృదయంలో దైవం పలికినట్లయ్యింది. ఆ తల్లి దేవునిపై భారం వేసి అలానే చేసింది. పెట్టెను నదిలో వదిలి ఆ పెట్టె ఎక్కడికి వెళుతుందో నైలు నది గట్టున ఉండి చూడమని పెద్ద కూతురికి చెప్పింది. ఆ పెట్టె నదిలో తేలుతూపోయి రాజ భవనం దగ్గర గట్టున అనుకుని ఆగిపోయింది. ఇంతలో రాజ భవనం నుంచి ఓ స్త్రీ బయటకు వచ్చింది. పెట్టెను తీసుకుని అంతఃపురంలోకి వెళ్ళింది. హజ్రత్ మూసా (అస) అక్క ఇదంతా దూరంగా ఉండి గమనించి సంతృప్తిగా వెళ్ళింది. తన సోదరుడు హజ్రత్ మూసా (అస) దగ్గరగా ఉండి చూసుకోవాలని ఆమె అంతఃపురంలో పరిచారికలా చేరింది. ఫిరౌన్ భార్య పెట్టెలో ఉన్న అందమైన బాలుడిని చూసి చాలా సంతోషించింది. వాత్సల్యంతో ముద్దుపెట్టుకుంది. ఆ పిల్లవాడిని పెంచసాగింది. అయితే ఈ విషయం ఫిరౌన్‌కు తెలిసింది. ఇస్రాయీలు వంశం పిల్లవాడిని చంపితీరాలని నిర్ణయించుకున్నాడు. కాని, భార్య తీవ్రంగా అడ్డు

చెప్పింది. "ఈ పసివాడిని చంపవద్దు. ఈ పిల్లవాడు మన కంటికి వెలుగు కావచ్చు. వీడిని పెంచుకుందాం" అని నచ్చజెప్పింది.

భార్య బలవంతంపై ఫిరౌన్ సరేనని అంగీకరించాడు. హజ్రత్ మూసా (అస) పెంపకానికి ఏర్పాట్లు జరిగాయి. పాలు పట్టడానికి అనేక మంది స్త్రీలను నియమించాడు. కాని, పిల్లవాడు ఎవ్వరి పాలూ త్రాగలేదు. అంతఃపుర పరిచారికగా ఉన్న మూసా (అస) అక్కయ్య ఇదంతా చూస్తూనే ఉంది. ఆమె రాణిగారితో:

"మీరు ఆజ్ఞాపిస్తే నేను ఓ ఆయా పేరు చెప్పగలను. ఆమె చాలా మంచిది. ఈ పనికి తగినది. మీరు సరేనంటే నేవెళ్ళి పిలుచుకువస్తాను" అని అడిగింది.

రాణిగారు సరేనన్నారు. ఆమె సంతోషంతో వెళ్ళి తన తల్లిని పిలుచుకొచ్చింది. దూరమయిన తన గారాల బిడ్డను చూసి ఆ తల్లికి కలిగిన సంతోషాన్ని మరో తల్లి మాత్రమే ఊహించగలదు.

ఆ తల్లి మమతానురాగాలకు, దైవంపై ఉన్న విశ్వాసానికి ప్రతిఫలంగా దైవం ఆమె ముద్దుల బిడ్డ ప్రాణాల్ని రక్షించడమే కాదు, ఆమె కంటికి వెలుగులా చేశాడు, పైగా ప్రాణ శత్రువు కోటలో రాచమర్యాదలతో బిడ్డ పెరగడానికి ఏర్పాట్లు చేశాడు. ముందు ముందు ఆ పిల్లవానితో పెద్ద పెద్ద పనులు చేయించాడు దైవం.

# విద్యాబుద్ధులు

పిల్లలకు సరియైన విద్యాబుద్ధులు చెప్పించడం కూడా తల్లిదండ్రులకు ముఖ్యమైన బాధ్యత. చదువు సంస్కారం నేర్చిన పిల్లలు పెద్దల కంటికి వెలుగవుతారు. చదువుసంధ్యల్లేని పిల్లలు పెద్దలకు మెడలో గుదిబండలా

తయారవుతారు. అలాటి పిల్లలు తమ బాధ్యతలను గ్రహించలేరు. సృష్టించిన దైవానికి, దైవ సృష్టి అయిన తోటి మనుష్యులకు తమపైగల హక్కులను గుర్తించలేరు. సరియైన విద్యాబుద్ధుల ప్రాముఖ్యాన్ని ఎరిగిన తల్లులు తమ పిల్లల విద్యాశిక్షణల కోసం సకల కష్టనష్టాలను చిరునవ్వుతో భరిస్తారు. పిల్లల శిక్షణ కోసం తప్పక ఏర్పాట్లు చేస్తారు. కాని, విద్యాసంస్కారాల ప్రాముఖ్యం తెలియని తల్లులు పిల్లల చదువులను నిర్లక్ష్యం చేసి, వారిని నాశనం చేస్తారు. సమయం మించిపోయిన తరువాత చేసిన తప్పుకు జీవితాంతం పశ్చాత్తాప పడుతుంటారు.

ఇమామ్ రాబిఅ అని ఓ ప్రముఖ ధర్మవేత్త, హదీసు నిపుణులు ఉండేవారు. ఆయన మస్జిదె నబవిలో బోధనలు చేసేవారు. ఆయన బోధనల వల్ల, హితవుల వల్ల, ఆయన చేసిన ధార్మిక సేవల వల్ల అసంఖ్యాక ప్రజలు లాభం పొందారు. ఆయన తల్లిగారు చాలా దైవభక్తిపరాయణురాలు. చాలా దూరదృష్టి కలవారు. ఆ పుణ్యస్త్రీ కారణంగానే ఇమామ్ రాబిఅ అంత పెద్ద ధర్మవేత్త, ధర్మసేవాదక్షుడు కాగలిగారు.

ఇమామ్ రాబిఅ తల్లి కడుపులో ఉన్నప్పుడు ఆయన తండ్రిగారికి ప్రభుత్వ ఉద్యోగంపై మాతృభూమికి దూరంగా ఉన్న ఖురాసాన్ వెళ్ళవలసి వచ్చింది. అక్కడ ఆయన దాదాపు ఇరవై ఏడు సంవత్సరాలు ఉన్నారు. ఆయన ఉద్యోగంపై భార్యను విడిచి వెళ్ళేటప్పుడు ఆమెకు ముప్పైవేల అష్రఫీలు ఇచ్చి వెళ్ళారు.

తండ్రి వెళ్ళిన కొద్ది నెలల తరువాత రాబిఅ జన్మించారు. ఆయన్ను తల్లి చాలా ప్రేమగా పెంచింది. కొద్దిగా పెరిగి పెద్దయిన తరువాత ఆయన చదువు శిక్షణలకు తగు ఏర్పాట్లు చేశారు. ఇమామ్ రాబిఅ కూడా చదువులో చాలా ఆసక్తి చూపేవారు. బుద్ధిగా పాఠాలు చదివేవారు. విద్యార్జన కోసం ఆయన చాలా దూర ప్రాంతాలు తిరిగారు. యుక్తవయస్సు వచ్చేవరకు ఆయన

వివిధ విషయాలపై జ్ఞానాన్ని సంపాదించారు. ఆయన తల్లిగారికి ఆయన చదువు పట్ల అమిత శ్రద్ధ ఉండేది. తన కుమారుడు ధర్మవేత్తగా పేరుపొంది ధార్మిక సేవలో నిమగ్నుడు కావాలని ఆమె ఆకాంక్షించేవారు. అందువల్ల ఆ పుణ్యస్త్రీ స్వయంగా అనేక కష్టాలను అనుభవించి భర్త ఇచ్చిన సొమ్మునంతటిని కుమారుని చదువుపై ఖర్చుపెట్టింది.

ఇరవై ఏడు సంవత్సరాల దీర్ఘకాలం తరువాత ఆమె భర్త ఇంటికి తిరిగివచ్చారు. ఈ మధ్యకాలంలో ఇమామ్ రాబిఅ విద్యాజ్ఞానాలను ఆర్జించి, ఇతరులకు ధార్మిక విషయాలను బోధించసాగారు. ఆయన తండ్రిగారు ఇంటికి వచ్చిన తరువాత భార్యతో తాను ఇచ్చిన సొమ్ము గురించి అడిగారు. అప్పుడు ఆమె ఏమని జవాబిచ్చారో తెలుసా:

"మీరు ఇచ్చిన అష్రఫీలను నేను వ్యర్థం చేయలేదు. అవన్నీ ఎలాటివి అలాగే సురక్షితంగా ఉన్నాయి."

యాదృచ్ఛికంగా అప్పుడు ఇమామ్ రాబిఅ హదీసు పాఠాన్ని బోధిస్తున్నారు. ఆయన తండ్రిగారు కూడా ఆ పాఠాన్ని వినసాగారు. ఇమామ్‌గారు చాలా బాగా హదీసు బోధన చేశారు. ఆ బోధన ఆయన తండ్రిగారిపై అమిత ప్రభావాన్ని వేసింది. ఇంటికి వచ్చి భార్య ముందు చాలా మెచ్చుకున్నారు. అప్పుడు ఆ భార్య భర్తతో- " ఇప్పుడు చెప్పండి, మీరిచ్చిన అష్రఫీలు విలువయినవా లేక కుమారుని మాటలు విలువైనవా? నేను ఈ సౌభాగ్యాన్ని పొందడం కోసం మీరిచ్చిన అష్రఫీలనన్నింటిని మీ పుత్రునిపైనే ఖర్చు చేశాను."

భార్య మాటలు విని భర్త అమిత సంతోషంతో, "నిస్సందేహంగా నువ్వు అష్రఫీలను వ్యర్థం చేయలేదు. వాటిని చాలా మంచి పనికి ఖర్చు చేశావు. ఇంతకు మించి ఆ సొమ్మును సద్వినియోగం చేసే పద్ధతి మరేదీ లేదు."

# పిల్లల శిక్షణ

పిల్లలు దైవం ఇచ్చిన సౌభాగ్యం. పిల్లలు మంచిగా గాని, చెడుగా గాని మారడం అన్నది వారి తల్లిదండ్రులపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. పిల్లల గురించి తల్లిదండ్రులను దైవం ప్రశ్నిస్తాడు. పిల్లల శిక్షణలో ప్రముఖ పాత్ర తల్లిది. ఎందుకంటే, పుట్టినప్పటి నుంచి అనేక సంవత్సరాలు పిల్లలు తల్లి ఒడిలో పెరుగుతారు. తల్లి చేస్తున్న పనులను చూసి అనుసరించాలనుకుంటారు. ఈ వయస్సులో ఏదయితే నేర్పుతామో అది శిలాక్షరంలా వారి మనసున నాటుకుంటుంది. జీవితాంతం చెరిగిపోదు.

ఉత్తమ స్త్రీలకు ఈ బాధ్యత ఎల్లప్పుడూ గుర్తుంటుంది. అందుకే తమ పిల్లలకు మంచి మాటలు నేర్పుతారు. చెడు అలవాట్ల నుంచి దూరంగా ఉంచుతారు.

పూర్వం సర్ సయ్యద్ అని మన దేశంలో ఓ ప్రముఖ నాయకుడు ఉండేవారు. నూరేళ్ళ క్రితం మన దేశ ప్రజలు ఇంగ్లీషు పాలకుల అత్యాచారాలను భరించలేక ఆంగ్లేయులను పారద్రోలేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తరువాత భారతీయులపై ఆంగ్లేయుల అత్యాచారాలు అడ్డు అదుపు లేకుండా పెరిగిపోయాయి. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటులో ముస్లిమ్‌లు చురుకుగా పాల్గొన్నందువల్ల ఇంగ్లీషు వారు ముస్లిమ్‌లపై పగబట్టారు. ముస్లిమ్‌లను నాశనం చేయాలని నిర్ణయించారు. ఆ సమయాన సర్ సయ్యద్ తన ప్రాబల్య ప్రభావం వల్ల ఆంగ్లేయుల కోపావేశాలపై నీళ్ళు చల్లారు. దాంతోపాటు ముస్లిమ్‌లను ఇంగ్లీషు చదువుల వైపు ప్రోత్సహించారు. చందాలు వసూలు చేసి అలీగఢ్‌లో కాలేజీని స్థాపించారు. అదే నేడు అలీగఢ్ ముస్లిమ్ యూనివర్సిటీగా అభివృద్ధి చెందింది.

సర్ సయ్యద్ ఢిల్లీలోని ఓ కులీన వంశంలో జన్మించారు. ఆయన తండ్రిగారు 'సూఫీ' ధోరణిగల మనిషి. ఆయన తన భార్యాపిల్లలను పట్టించుకునే

వారుకాదు. సర్ సయ్యద్ తల్లిగారు చాలా ఉత్తమ మహిళ. ఆమె సర్ సయ్యద్ విద్యాశిక్షణల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు.

ఓసారి ఏమయ్యిందంటే, అప్పటికి సర్ సయ్యద్ ఇంకా చిన్న పిల్లవాడే, ఆయనకు ఏదో మాట మీద కోపం వచ్చి ఇంటి నౌకరును పట్టుకుని కొట్టారు. ఈ విషయం ఆయన తల్లికి తెలిసింది. ఆమెకు చాలా బాధనిపించింది. వెంటనే ఆమె కొడుకుపై చర్య తీసుకుంది. అన్నపానీయాలను బంద్ చేసి కొడుకును ఇంటి నుంచి వెళ్ళగొట్టారు. ఆయన ఇంటి నుంచి పినతల్లి దగ్గరి కెళ్ళారు. రెండు మూడు రోజులు అక్కడ గడిపారు. నౌకరుతో క్షమాపణలు కోరుకున్నారు. అప్పుడుగాని ఆయన్ను తల్లిగారు ఇంట్లోకి రానీయలేదు.

తన తల్లి వేసిన ఈ శిక్షను సర్ సయ్యద్ జీవితాంతం మరువలేదు. పెద్దయిన తరువాత ఆయన చాలా పేరుప్రతిష్ఠలను గడించారు. అయినా నౌకర్లను ఎల్లప్పుడు చాలా బాగా చూసేవారు. ఆయన్ను వ్యతిరేకించే అవకాశం వారికెన్నడూ ఇవ్వలేదు.

# కుటుంబ సభ్యులలో ధార్మిక చైతన్యాన్ని సృష్టించాలి

ధర్మంపై మనం స్వయంగా నడవడమే కాదు. మన ఇంటివారిని కూడా ధర్మంపై నడిచేలా చేయడం అవసరం. మనం, మన కుటుంబ సభ్యులు నరకాగ్ని నుంచి తప్పించుకోవాలని దైవం బోధించాడు. తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి, కొడుకు, కూతురు, భర్త వీరందరిని ధర్మం వైపు పిలువాలి. ధర్మంపై నడిచేలా ప్రోత్సహించాలి. మంచి అమ్మాయిలు తమ ఈ బాధ్యతను చక్కగా గుర్తిస్తారు. అలాటి అమ్మాయిల వల్ల ఇంటిలోని సభ్యులందరూ సక్రమ మార్గాన నడిచి తమ ఇహ, పర లోకాలలో సౌభాగ్యాలను పొందుతారు.

ప్రవక్త (స) సహచరులలో హజ్రత్ ఉమ్మె సలీమ్ ఒకరు. ఆమె

మదీనాలో ఉండేవారు. ఆమె ఇంటివాళ్ళు తమ వంశానికి చెందిన ఓ అబ్బాయికిచ్చి పెళ్ళి చేశారు. ఆమె భర్త పేరు మాలిక్. ఆ దంపతులకు ఓ పిల్లవాడు పుట్టాడు. ఆ పిల్లవానికి అనీస్ (రజి) అని పేరు పెట్టారు.

పెళ్ళయిన కొద్ది సంవత్సరాల తరువాత మన ప్రియప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తగా అవతరించారు. ధర్మబోధ చేయసాగారు. మదీనావాసులు కొంత మంది ప్రవక్త (స)ను కలిసి ఇస్లామ్‌ను స్వీకరించారు. అలా ముస్లిమ్‌లైనవారి నోట హజ్రత్ ఉమ్మె సలీమ్ ఇస్లామ్ సందేశం గురించి విన్నారు. ఇస్లామ్ సందేశం ఆమె మనస్సులో నాటుకుంది. వెంటనే ఇస్లామ్ స్వీకరించారు. అసత్య దైవాలను వదిలి ఏకైక దేవుని ఆరాధనలో లీనమయ్యారు.

ఆమె పుత్రుడు హజ్రత్ అనీస్ (రజి) అప్పటికి ఇంకా పిల్లవాడు. పిల్లవాడిని ధర్మసేవకుడిగా తయారుచేయాలని ఆమె నిర్ణయించుకున్నారు. అందుకోసం అప్పటి నుంచే ప్రయత్నాలు ఆరంభించారు. ఆ పసివాడికి ముందు పవిత్ర కలిమా (సాక్ష్య వచనం) నేర్పారు. కలిమా అర్థాన్ని వివరించారు ఆపై మంచి నడవడిక నేర్పారు. ధర్మం కోసం ఎండావానలను భరించే అలవాటు చేశారు.

ఆమె భర్త మాలిక్ ఇస్లామ్ విశ్వాసాన్ని స్వీకరించలేదు. తీవ్రంగా వ్యతిరేకించసాగాడు. ఆమె భర్తక్కూడా నచ్చజెప్పింది. ఏకైక దేవుని ఆరాధించాలని దైవాజ్ఞలను అనుసరించాలని ప్రోత్సహించింది. ఇంతలో మాలిక్‌కు దూర ప్రయాణంపై వెళ్ళవలసివచ్చింది. దారిలో అతడిని ఎవరో శత్రువులు హత మార్చారు. ఆమె వితంతువయ్యారు.

వితంతువు అయిన తరువాత చాలా మంది ఆమెను పెళ్ళాడ్డానికి ముందుకొచ్చారు. కాని, ఆమె తిరస్కరించారు.

'నా చిన్నారి పిల్లవాడు ధర్మగోష్ఠుల్లో కూర్చుని, చర్చించేటంతటివాడు అయ్యేవరకు నేను అన్ని కష్టాలను భరిస్తాను. కాని, పెళ్ళి మాత్రం చేసుకోను' అన్నారామె.

మళ్ళీ పెళ్ళి చేసుకుంటే సవతి తండ్రి అనీస్ (రజి) విద్యార్జనకు అడ్డు చెబుతాడేమోనని అనుమానించిందామె. తన తల్లి చేసిన ఈ మేలును హజ్రత్ అనీస్ (రజి) ఎన్నడూ మరువలేదు. ఎప్పుడయినా అలాటి సందర్భం వస్తే ఆయన తన తల్లి తన కోసం చేయవలసిందంతా చేసేసిందని అనేవారు.

హిజ్రత్ తరువాత హుజూర్ (స) మదీనాకు వచ్చారు. అప్పుడు హజ్రత్ అనీస్ (రజి) పది సంవత్సరాల పిల్లవాడు. ఉమ్మె సలీమ్ ఆయన్ను తీసుకుని సర్కార్ ముహమ్మద్ (స) సన్నిధిలో హాజరై, "ఓ దైవప్రవక్తా! నా పిల్లవాడిని చాలా ఆశతో పెంచుతున్నాను. వీడు మీకు సేవ చేయాలని, మీ పనులలో తోడ్పడాలన్నది నా ఆకాంక్ష" అని చెప్పారు.

ముహమ్మద్ (స) ఆ కోరికను మన్నించారు. హజ్రత్ అనీస్ (రజి) జీవితాంతం తన వద్దనే ఉన్నారు. హజ్రత్ అనీస్ (రజి) సుగుణాల వల్ల ప్రవక్త (స) ఆయన్ను అమితంగా ప్రేమించేవారు. ఉమ్మె సలీమ్ తన బాధ్యత నుంచి విముక్తులయ్యారు. ఆమె వంశానికి చెందిన ఓ పెద్ద మనిషి అబూ తల్హా (రజి) ఆమెకు పెళ్ళి సంబంధం పంపారు. కాని, ఆమె తిరస్కరించారు.

"నేను ముహమ్మద్ ప్రవక్త (స)ను విశ్వసించాను. నువ్వు అవిశ్వాసివి. నేను నిన్ను ఎలా పెళ్లాడగలను? అబూతల్హా! నువ్వు విగ్రహారాధకుడివి కావడం శోచనీయం. భూమి నుంచి పుట్టే కలపతో తయారయిన విగ్రహాలు, వాటిని నీగ్రో బానిసలు తయారుచేస్తారు. ఇవి నీకు నష్టాన్ని కలిగించలేవు, లాభాన్నీ కలిగించలేవు. నువ్వు ఆ సర్వశక్తిమంతుడు, ఆగ్రహానుగ్రహ సమర్థుడయిన, భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు అయిన అల్లాహ్‌ను పూజించవు."

అబూతల్హా మనస్సులో ఈ మాట నాటుకుంది. విగ్రహాలను విరగ్గొట్టి పొయ్యిలో వేశాడు. ప్రవక్త (స) సన్నిధిలో హాజరై ఇస్లామ్ స్వీకరించారు. అప్పుడు ఉమ్మె సలీమ్ ఆయన్ను పెళ్ళాడారు. అబూతల్హా ఇస్లామ్ స్వీకరణయే

ఆమెకు మెహర్ (స్త్రీ ధనం)గా నిర్ణయమయ్యింది. ఆ విధంగా ఆ పుణ్యస్త్రీ వల్ల ఇంటి సభ్యులకు విశ్వాస పెన్నిధి లభించింది. దైవధర్మానికి ఉత్తమ సేవకులు లభ్యమయ్యారు.

# ధర్మప్రభావం

జీవితంలో దైవధర్మం ఎంత అవసరమో అర్థమయితే జీవితాలు మారిపోతాయి. ఇంతకు ముందు గర్వంతో చేసిన పనులు, చెప్పిన మాటల గురించి గుర్తుకువచ్చినా మనస్సు గడగడ వణుకుతుంది. పాత దురలవాట్లు క్రమేణా దూరమవుతాయి. ప్రతి వ్యవహారంలోను దైవాదేశాలు దృష్టిలో ఉంటాయి. దైవ మార్గంలో పెద్ద పెద్ద త్యాగాలను సంతోషంతో చేస్తారు.

హజ్రత్ ఖన్సా (రజి) గురించిన ఓ సంఘటన. ఆమె అరేబియాలోని ఓ ప్రముఖ కవయిత్రి. హుజూర్ (స) ఆమె కవిత్వాన్ని ప్రశంసించారు. హజ్రత్ ఖన్సా (రజి)కు తన బంధువుల పట్ల అమిత ప్రేమాభిమానాలుండేవి. అందులోనూ తన సోదరుడు సఖర్ అంటే అమిత ప్రేమ. అందుకు తగ్గట్టే ఆ సోదరుడు అత్యంత ధైర్యశాలి, బుద్ధిమంతుడు, ఉదారశీలి. అతడికీ సోదరి అంటే ఎంతో ప్రేమ. ఆమె ఇస్లామ్ స్వీకరించక ముందు ఆమె తండ్రి ఆమెను ఓ అయోగ్యుడికిచ్చి పెళ్ళి చేశారు. అతగాడు ఇంటిలోని సామానంతటిని అమ్మి అనవసర ఖర్చులు వెలగబెట్టాడు. చేతిలో చిల్లిగవ్వలేని స్థితిలో సోదరుడు సఖర్ ఆదుకున్నాడు. తన వద్ద ఉన్న సంపదలో సగభాగాన్ని సోదరికిచ్చాడు. కాని, ఆమె భర్త ఆ సొమ్మును కూడా తన విలాసాలకు తగులబెట్టాడు. సోదరుడు మళ్ళీ సహాయం చేశాడు. తన వద్ద ఉన్న ఆస్తిలో మళ్ళీ సగభాగం ఇచ్చాడు. ఇలాంటి సోదరుని ప్రాణప్రదంగా ప్రేమించని సోదరి ఉంటుందా!

ఓ యుద్ధంలో ఆమె సోదరుడు సఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడి రొమ్ముపై బలమయిన వ్రేటు పడింది. ఊపిరితిత్తులు బయటపడి

కనబడసాగాయి. హజ్రత్ ఖన్సా (రజి) చాలా దుఃఖించారు. సోదరుడికి ఓ సంవత్సరంపాటు సేవ చేసిందామె. అనేక కష్టాలను భరించింది. అయినా సఖర్ పరిస్థితి మెరుగవ్వలేదు. ఆ గాయంతోనే మరణించాడు.

సోదరుడి మరణం ఆమెను తీవ్రంగా కలచివేసింది. దుఃఖంతో ఆమె తల్లడిల్లిపోయింది. సోదరుని జ్ఞాపకాలతో శోకగీతాలను ఆలపించసాగింది. ఆమె ఆలపించిన శోకగీతాలను విన్నవాళ్ళ కంట నీళ్ళు తిరిగేవి. సోదరుని మరణానికి దుఃఖ చిహ్నంగా ఆమె తలపై నల్లని వస్త్రాన్ని వేసుకునేది. నల్లని వస్త్రాన్ని తలపై ధరించడం అరబ్బుల్లో తీవ్ర దుఃఖానికి చిహ్నం.

ఇస్లామ్ స్వీకరించిన తరువాత హజ్రత్ ఖన్సా (రజి) ధోరణి పూర్తిగా మారిపోయింది. దీర్ఘకాలం తన మరణించిన సోదరుని దుఃఖంతో గడుపుతూ వచ్చిన ఆమె, సోదరుని జ్ఞాపకాలతో తలకు నల్లని వస్త్రాన్ని ధరించి తిరిగిన ఆమె ఇస్లామ్ స్వీకరించిన తరువాత ధర్మవ్యాప్తి కోసం తన సర్వస్వాన్ని సంతోషంతో ధారపోసే స్త్రీగా మారింది.

హజ్రత్ ఉమర్ (రజి) కాలమది. ఖాదిసియా ప్రాంతంలో ఈరానీలతో తీవ్ర పోరాటం ఎదురయ్యింది. ఉవ్వెత్తున లేస్తున్న ఇస్లామీయ ఉద్యమ కెరటాలను నిరోధించడానికి ఈరానీయులు చేస్తున్న ఆఖరి ప్రయత్నమది. అందుకు వాళ్ళు సమాయత్తమై సకల సన్నాహాలతో వచ్చారు. హజ్రత్ ఖన్సా (రజి)కు పరిస్థితి ఎంత సున్నితంగా ఉందో అర్థమయ్యింది. ఆమె తన నలుగురు కొడుకులతో సహా యుద్ధంలో పాల్గొన్నారు. యుద్ధానికి ముందు రాత్రి ఆమె తన కొడుకులతో-

"నా ముద్దుల కుమారులారా! మీరు సంతోషంతో మనస్ఫూర్తిగా ఇస్లామ్ స్వీకరించారు, హిజ్రత్ చేశారు. ఆ పవిత్ర దైవం తోడు! మీరు ఒక తల్లి కడుపున ఎలా జన్మించారో అదే విధంగా మీరు ఒక తండ్రి సంతానం. నేను మీ తండ్రికి ద్రోహం చేయలేదు. మీ మామయ్యలను అప్రతిష్టపాలు చేయలేదు.

మీ మర్యాదకు మచ్చ రానీయలేదు. మీ వంశానికి కళంకం తేలేదు. నా బిడ్డలారా! దైవ మార్గంలో పోరాడితే దైవం ఎంత సంతోషిస్తాడో మీకు తెలుసు. పరలోకపు శాశ్వత జీవితం ముందు ఇహలోకపు నాలుగు దినాల జీవితానికి ప్రాధాన్యత అస్సలు లేదని మీరు మరువవద్దు.

"ఓ విశ్వసించినవారలారా! సహనంతో వ్యవహరించండి. అవిశ్వాసులకు వ్యతిరేకంగా ధైర్యసాహసాలు ప్రదర్శించండి. ధర్మసేవకు నడుం కట్టండి. దైవానికి భయపడండి. మీరు సాఫల్యం పొందుతారని...." *(ఆలి ఇమ్రాన్-20)*

మీరు దైవ సహాయాన్ని అర్థిస్తూ ముందుకునడవండి. పోరాటం కఠినంగా మారినా లెక్కచేయవద్దు. ఇన్షా అల్లాహ్, దైవం తలిచితే పరలోకంలో విజయులుగా ఉంటారు."

మరుసటి రోజు యుద్ధం ఎంత తీవ్రంగా మారుతున్నప్పటికీ లెక్కచెయ్యక ఆ నలుగురు కొడుకులు తల్లి మాటలను మననం చేస్తూ యుద్ధరంగంలోకి చొచ్చుకుపోయారు. యుద్ధజ్వాలలను లక్ష్యంచేయక దూకారు. ఒకరి తరువాత ఒకరుగా నలుగురు ధర్మయుద్ధంలో నేలకొరిగారు.

హజ్రత్ ఖన్సా (రజి)కు నలుగురు కుమారుల షహాదత్ (మరణం) గురించి తెలిసినపుడు ఆమె దుఃఖించడానికి బదులు, శోకగీతాలు పాడడానికి బదులుగా ఆమె నోటి నుంచి:

"దైవానికి కృతజ్ఞతలు. ఆయన నాకు కుమారుల షహాదత్ గౌరవాన్ని ఇచ్చాడు. దైవం కారుణ్యఛాయల్లో ఆ నలుగురితో పాటు నేనూ ఉంటానని నమ్ముతున్నాను" అన్న మాటలు వెలువడ్డాయి.

ఆమె నమ్మకం ఎందుకు నెరవేరదు. ఆమె ధర్మం స్వీకరించింది, విశ్వసించింది. దైవప్రీతిని పొందడమే సంతోషంగా భావించింది.

# ఉత్తమ ప్రచారం

మనకు తెలిసిన ధార్మిక విషయాలను మనం అమలుచేయడం మాత్రమే కాదు. ఆ విషయాలను ఇతరులకు కూడా చేరవేయాలి. మన మాటలతో, ఆచరణలతో ధార్మిక విషయాలను ఇతరులకు పరిచయం చేయడమే సందేశ ప్రచారం. సందేశ ప్రచారంలో మనం చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. లేకపోతే కొద్దిపాటి అజాగ్రత్త వల్ల లాభానికి బదులు నష్టం వాటిల్లుతుంది.

షావలి అల్లా దహెల్వి రహమతుల్లా అలైహ్ పేరు మీరు వినే ఉంటారు. ఆయన మన దేశంలోని ఓ పెద్ద ధర్మసేవకునిగా, నిష్ఠాగరిష్ఠునిగా పేరు గడించారు. ఆయనతోపాటు ఆయన వంశంవారికి కూడా దైవం విద్యాజ్ఞానాలను ప్రసాదించాడు. ఆ వంశంలో ఒకరిని మించి ఒకరు ధర్మవేత్తలు, దైవదాసులు అయిన నిష్ఠాగరిష్ఠులు పుట్టారు. ఆయన మనుమలలో ఒకరు షా ఇస్మాయీల్ షహీద్. నేటికి దాదాపు నూరేళ్ళ క్రితంనాటి మాట ఇది. ఢిల్లీలో మొగల్ చక్ర వర్తులు పాలించేవారు ఆనాడు. ఆనాటి చక్రవర్తికి బీఛక్కు అనే అక్కగారు ఉండేది. ఆమె చక్రవర్తిని చిన్నప్పటి నుంచి ఒళ్ళో ఆడించింది. అందువల్ల చక్రవర్తి ఆమెను చాలా గౌరవించేవారు. మాటిమాటికి ఆమె తిడుతూ, కేకలు వేస్తూ ఉండేది. ఆమెకు ఎదురు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు. రాజభవనంలోని వారందరికీ ఆమె అంటే హడల్.

షా ఇస్మాయీల్ (రఅ) ధర్మపరాయణత్వం దిశదిశలా ప్రాచుర్యం పొందసాగింది. స్వార్థపరులు, కపటులు అయిన కొందరికి ఇది నచ్చలే ను. ఆయన వ్యక్తిత్వానికి మచ్చ తేవాలని వాళ్ళు తీవ్ర కృషి చేయసాగారు. ప ే మంది ఎదుట ఆయన్ను చక్రవర్తి అక్కయ్య బీఛక్కుతో తిట్టేలా చేయాలని

వాళ్ళు పథకమేశారు. రాకుమారులను ఒప్పించి ఓ ఉత్సవాన్ని నిర్వహించారు. ఆ ఉత్సవానికి షా ఇస్మాయీల్ (రఅ)ను, బీఛక్కును ఆహ్వానించారు. ఈలోగా షా ఇస్మాయీల్ (రఅ)కు వ్యతిరేకంగా బీఛక్కు చెవుల్లో ఇల్లు కట్టుకుని చాడీలు నూరిపోశారు.

"ఆ ఇస్మాయీల్‌గారు బీబీ ఫాతిమా సహ్నక్ ఉత్సవం చేయ వద్దంటాడండీ..."

"మీరాన్‌జి మేకను బలివ్వడం అధర్మమన్నాడండీ...."

"ఆయన పెద్ద పీరుగారి గ్యారిమీ చేయరాదని ఖండిస్తున్నాడు."

ఇలా అనేక రకాలుగా ఉత్సవానికి ముందే మౌలానాకు వ్యతిరేకంగా బీఛక్కును రెచ్చగొట్టి ఉంచారు.

ఉత్సవం ప్రారంభమయ్యింది. బీఛక్కు వచ్చి పరదా వెనుక కూర్చుంది. షా (రఅ)గారికి ఏదో పని కారణంగా రావడం కొద్దిగా ఆలస్యమయ్యింది. దాంతో అవకాశవాదులు బీఛక్కును మరింత రెచ్చగొట్టారు.

"చూశారా! ఇస్మాయీల్‌కు ఎంత గర్వమో, ఇంకా రాలేదు."

కాసేపటికి షా ఇస్మాయీల్ (రఅ) వచ్చారు. బీఛక్కు అప్పటికే కోపంతో మండిపడసాగింది.

"అబ్దుల్ అజీజ్ (రఅ) కుమారుడు ఇస్మాయీల్ వచ్చాడా?" అని అడిగింది.

ఆ కార్యక్రమం ధోరణిని చూడగానే షాగారికి ఏదో అల్లరిపెట్టే ఆలోచనలు ఎవరికో ఉన్నాయని అర్థమయిపోయింది. నెమ్మదిగా అన్నారు:

"అరె, ఈ గొంతు బీఛక్కుగారిదిలా ఉంది. అమ్మా- సలామ్."

షా గారి గొంతులోని నమ్రత, నెమ్మదిలతో బీఛక్కు కోపం చల్లారి పోయింది. ఆమె ఎంతో మర్యాదగా సలామ్‌కు జవాబు చెప్పింది.

"ఏమయ్యా, నువ్వు బీబీ ఫాతిమా సహ్‌నక్ ఉత్సవం చేయవద్దంటున్నావని విన్నాను."

"లేదమ్మా! నాకంత సాహసం ఎక్కడిది?"

"మరి వీళ్ళెందుకు ఫిర్యాదు చేస్తున్నట్టు?" అడిగిందామె మళ్ళీ.

అప్పుడు షాగారు: "అసలు విషయమేమంటే బీబీ ఫాతిమా (రజి) తండ్రి గారు (ప్రియప్రవక్త (స)) అలా చేయవద్దని వారిస్తున్నారు. నేను ప్రజలకు బీబీ (రజి) తండ్రి (ప్రవక్త (స)) ఆదేశాన్ని వినిపిస్తూ ఉంటాను" అన్నారు. అది విని బీఛక్కు ఆశ్చర్యంతో:

"ఏంటీ? బీబీ (రజి) తండ్రిగారు (స) చేయవద్దన్నారా?"

"అవునమ్మా!" షాగారు జవాబిచ్చారు.

"మన ధర్మంలో లేని క్రొత్త ఆచారాన్ని ఎవరు ప్రారంభించినా దాన్ని రద్దు చేయాలని ఆయన (స) అన్నారు" అని షాగారు ఆ తరువాత ఆ హదీసునే ప్రశంసాత్మకమయిన రీతిలో వివరించి చెప్పారు. బీఛక్కు అంతా జాగ్రత్తగా విని చాలా ప్రభావితురాలయ్యింది.

"ఇప్పటి నుంచి ఏ స్త్రీ అయినా బీబీ సహ్‌నక్ ఉత్సవం చేస్తే ముక్కు చెవులు కోసేస్తాను. మనం బీబీ (రజి)పై విశ్వాసం తేలేదు. బీబీ నాన్నగారి (స)పై విశ్వాసం తెచ్చాం. ఆయన (స) వద్దన్న పని మనం ఎందుకు చేయాలి?" అని హెచ్చరించిందామె.

అలా, సందేశ ప్రచారంలో షాగారి బుద్ధిచాతుర్యంతో ఆ ఉత్సవం తీరే మారిపోయింది. పైగా రాజభవనంలో సందేశ ప్రచారానికి పెద్ద ఆటంకంగా ఉన్న ఓ దురాచారాన్ని నిర్మూలించడంలో షాగారికి ఆ స్త్రీ సహాయకురాలయ్యింది.

# ఉత్తమ వ్యవహారశైలి

ఖుల్ఫా-ఎ-రాషిదీన్- నలుగురు ఖలీఫాల తరువాత ముస్లిమ్‌ల పాలనా అధికారం బనీ ఉమయ్యా వంశం చేతిలోకి వచ్చింది. అధికారం, సంపద అన్నవి చంచలమయినవి. నేడు ఉంటాయి, రేపు మాయమయిపోతాయి. కాని వాటి నిషా చాలా మందిని దుర్మదాంధుల్ని చేస్తుంది. అలాగే ఈ వంశానికి చెందిన కొంత మంది పాలకులు అధికార మదంతో ప్రవక్త సహచరుల (రజి), ధర్మ సేవకుల (రఅ), ధర్మవేత్తల, ప్రజల పట్ల అనేక అత్యాచారాలకు పాల్పడ్డారు. అనేక మంది అమాయకుల రక్తాన్ని చిందించారు. ముస్లిమ్ సమాజం సంఘ సేవకులను అనేక మందిని కోల్పోయింది.

బనీ ఉమయ్యా వంశస్థులు వంద సంవత్సరాలన్నా పూర్తిగా పాలించలేదు. దైవం వారి చేతి నుంచి అధికారాన్ని లాక్కుని బనీ అబ్బాసీ వంశానికి ఇచ్చాడు. అధికార పగ్గాలు చేతికి రాగానే బనీ అబ్బాసీలు, బనీ ఉమయ్యా పేరు కూడా కనబడకుండా చెరిపేశారు. ఈ వంశానికి చెందిన వ్యక్తులందరినీ, పురుషులను, స్త్రీలను, పిల్లలను, వృద్ధులను అందరినీ వెదికి వెదికి హత్యచేయడం మొదలయ్యింది. అక్కడి నుండి దూర దేశాలకు పారిపోయినవాళ్ళు మాత్రమే ప్రాణాలతో బ్రతికి బయటపడ్డారు. బనీ ఉమయ్యాలోని ఆఖరి రాజు రెండవ మర్వాన్ భార్య మహారాణి మజ్‌న కూడా దేశ సరిహద్దులను దాటి ప్రాణాలను రక్షించుకుంది.

అబ్బాస్ వంశంలోని మూడవ రాజు మెహది కాలమది. ఓనాడు మహారాణి ఖైజ్‌రాన్ తన చెలికత్తెలతో కూర్చుని ఉండగా ఓ స్త్రీ సలామ్ చేస్తూ లోపలికొచ్చింది. ఆమె ధరించిన వస్త్రాలు చినిగిపోయి, మాసిపోయి, అతుకులు పడి ఉన్నాయి. కాని, నడక, మనిషి తీరు, ముఖవర్చస్సుతో ఆమె కులీన వంశానికి చెందినదిలా కనబడుతుంది. ఖైజ్‌రాన్ ఆమెతో,

"ఎవరమ్మా నువ్వు?" అనడిగింది.

"నేను రెండవ మర్వాన్ భార్య మజ్‌న"ను జవాబిచ్చింది ఆ స్త్రీ.

"అనేక సంవత్సరాలుగా ఈ పరిస్థితిలో వీధి వీధి తిరుగుతున్నాను. కాలం ఈ దురదృష్టవంతురాలిని ఈ హీనస్థితికి చేర్చింది. నా ఒంటిపై ఉన్న ఈ చిరిగిన పాత వస్త్రాలను చూస్తున్నారుగా, ఇవి కూడా నావి కావు. ఎవరో దానం చేసినవి. ఇలా అడుక్కోవడం నాకు నచ్చలేదు. అందుకే మీ వద్దకు వచ్చాను. ఇకనుంచి ఏమి జరిగినా మీ పరదాలో జరగాలని."

మజ్‌న పరిస్థితి చూసి ఖైజ్‌రాన్ కళ్ళలో అశ్రువులు వచ్చాయి. కాని ఖైజ్‌రాన్ ఎక్కువగా ఇష్టపడే దాసి జైనబ్ మాత్రం మజ్‌నను సూటిపోటి మాటలనడం ప్రారంభించింది.

"మజ్‌న నువ్వు ఆ రోజును మరచిపోయావా. నీ వద్దకు మేం ఇబ్రాహీమ్ అబ్బాస్ శవాన్ని అడగడానికొచ్చాం. అప్పుడు నువ్వు మమ్మల్ని తిట్టిపోశావు. నౌకర్లతో కొట్టి గెంటించావు. దైవం నీ నుంచి తానిచ్చిన అధికారాన్ని లాక్కొని మంచి పని చేశాడు."

"నువ్వు చెప్పేది నిజమే. నేను నిజంగానే చాలా చెడ్డగా వ్యవహరించాను. ప్రతిఫలం నేడు అనుభవిస్తున్నాను. మా ఆచరణలే మమ్మల్ని ఈ స్థితిక దిగజార్చాయి. కాని, మహారాణి ఖైజ్‌రాన్ కూడా అలాగే వ్యవహరించి మాలా తయారవ్వాలని కోరుతున్నావా నువ్వు. నువ్వు ఉత్తమ వ్యవహార శైలిని ప్రోత్స హించవలసి ఉంది. చెడుకి బదులు చెడు చేయకుండా ఆపాలి. తద్వారా దైవం ఇచ్చిన సౌభాగ్యం శాశ్వతంగా ఉండగలదు. ఇతరుల హక్కుల్ని నిరాకరించడం, చెడుగా వ్యవ హరించడం వల్లనే దైవం మమ్మల్ని ఈ స్థితికి చేర్చాడు. నిన్నటి మహారాణి నేడు పైసా పైసా కోసం చేయి చాస్తూంది. తినడానికి తిండి, కట్టు

బట్టల్లేక మీ ముందు నిలబడి ఉంది. నన్ను చూసయినా మీరు పాఠం నేర్చుకోవడం లేదా?"

ఇలా చెప్పి మజ్‌న ఏడుస్తూ వెళ్ళసాగింది. మహారాణి ఖైజ్‌రాన్‌కు ఆమెపై చాలా జాలి కలిగింది. ఆమె ఓ దాసికి సైగ చేసింది. ఆ దాసి మజ్‌నను లోపలి గదిలోకి తీసుకుని వెళ్ళింది. స్నానం చేయించి మంచి బట్టలు ఇచ్చింది. భోజనం వడ్డించింది. ఆ రోజు రాత్రి మెహ్‌ది వచ్చిన తరువాత మహారాణి సంఘటనను వినిపించింది. మెహ్‌ది వెంటనే దాసిని పిలిచి మజ్‌న ఎలా ఉందని విచారించాడు. మజ్‌న, సూరె నహ్ల్‌లోని ఓ ఆయత్‌ను చదివి చాలా రాత్రి వరకు దుఃఖిస్తూ గడిపిందని తెలిపిందామె.

> "అల్లాహ్ ఒక నగరం యొక్క ఉదాహరణనిస్తున్నాడు: అది శాంతిమయ సంతృప్తికర జీవితాన్ని గడుపుతూ ఉండేది. ప్రతి వైపు నుండి దానికి ఆహారం పుష్కలంగా చేరుతూ ఉండేది. ఆ తరుణంలో అది అల్లాహ్ కానుకలకు కృతఘ్నత చూపడం ప్రారంభించింది. అప్పుడు, అల్లాహ్ దాని పౌరులకు వారి చేష్టల రుచిని ఎలా చూపాడంటే ఆకలి మరియు భయం యొక్క ఆపదలు వారిని చుట్టుముట్టాయి." *(అన్ నహ్ల్ : 112)*

ఈ ఆయతు విని మెహ్‌ది కూడా చాలా ప్రభావితుడయ్యాడు. జైనబ్‌ను పిలిచి చీవాట్లు పెట్టాడు. ఆ తరువాత ఖైజ్‌రాన్‌తో:

"నువ్వు, మజ్‌నతో ఉత్తమంగా వ్యవహరించకపోతే నేను నీతో ఎన్నడూ మాట్లాడి ఉండేవాడిని కాదు" అని, తరువాత మజ్‌న పట్ల సానుభూతితో వ్యవహ రించాడు. ఆమె ఉండడానికి ఏర్పాట్లు చేశాడు. ఆమె జీవించి ఉన్నంత కాలం రాజభవనంలోని ఇతర స్త్రీలలా ఆమెకు గౌరవ మర్యాదలు లభించేలా చూశాడు.

# వాగ్దానపాలన

ముస్లిములు ఒకే ఒక్క దేవుడయిన అల్లాహ్‌ను మాత్రమే పూజిస్తామని, ఆరాధిస్తామని, దైవాజ్ఞలను పాలిస్తామని వాగ్దానం చేస్తారు. ఆ వాగ్దానాన్ని తు.చ. తప్పక పాటించడం ఎంతైనా అవసరం. అలాగే దైవ సృష్టిలోని తోటి మానవులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం కూడా అవసరం. ఇచ్చిన మాటను ఎన్ని కష్టాలు ఎదురయినాసరే నిలబెట్టుకోవాలి. ఎవరికయినా మాట ఇచ్చే ముందు చాలా బాగా ఆలోచించి మరీ ఇవ్వాలి. మనకు సాధ్యంకాని పని అయితే ముందే స్పష్టంగా చెప్పెయ్యడం మంచిది. అందువల్ల మరొకరు మనపై నమ్మకముంచి తరువాత నిరాశపడే పరిస్థితి రాదు. ఒకవేళ ఏదన్నా పని చేస్తామని ఎవరికన్నా మాట ఇచ్చేస్తే ఆ మాటను నిలబెట్టుకోవాలి. ఇచ్చిన మాటను తప్పితే ఈ ప్రపంచంలోనూ అవమానం తప్పదు, మనపై ఇతరులకు నమ్మకమూ పోతుంది. ఇక పరలోకంలో జవాబీయక తప్పని కఠిన పరిస్థితిని ఎదుర్కోక తప్పదు. దైవం మన వాగ్దానభంగాన్ని ప్రశ్నిస్తాడు.

మంచి అమ్మాయిలు ఇచ్చిన మాటపై నిలబడతారు. ఎట్టి పరిస్థితిలోనూ వాగ్దానభంగం కానివ్వరు.

హజ్రత్ ఉమ్మె అమ్మారా (రజి) అని ఓ ప్రముఖ సాహెబా - అంటే ప్రవక్త (స) సహచరవర్గంలోని మహిళ ఉండేవారు. ఆమె మదీనాలో ఉండేవారు. హుజూర్ (స) మదీనాకు హిజ్రత్ చేయకముందే ఆమె ఇస్లామ్ స్వీకరించారు.

ముస్లిమ్ అయిన తరువాత, కొన్ని రోజులకు ఆమె హజ్ యాత్ర కోసమని మక్కా వెళ్ళారు. హజ్ ముంగించుకుని మదీనా ముస్లిమ్‌లు ప్రవక్త (స)ను ఏకాంతంలో కలుసుకున్నారు. ఆ ముస్లిమ్‌ల బృందంలో ఆమె కూడా ఉన్నారు. మక్కాలోని అవిశ్వాసుల సర్దారులు ముహమ్మద్ (స)ను, ఆయన అనుచరులను చాలా బాధలకు గురిచేసేవారు. ఆ మూర్ఖులకు సత్యమార్గ మయిన ఇస్లామ్ అంటే పడేది కాదు. మనుష్యులకు ఇహపరలోకాల్లో

సాఫల్యాన్నిచ్చేందుకు అవతరించిన ఇస్లామ్‌ను నామరూపాల్లేకుండా చేయాలని ప్రయత్నించేవారువాళ్ళు. చెడ్డకాలం వచ్చినప్పుడు బుద్ధి పెడమార్గం పడుతుందన్నది నిజమే. మక్కా అవిశ్వాసుల పరిస్థితి అంతే. తమ శ్రేయోభి లాషులనే శత్రువులుగా భావించారు వాళ్ళు.

అసలు కథకు వద్దాం. మదీనా నుంచి హజ్ కోసం వచ్చి ముహమ్మద్ (స)ను కలుసుకున్న ముస్లిమ్‌లు, హుజూర్ (స)ను మదీనాకు రావలసిందిగా ఆహ్వానించారు. అంతేకాక, ముహమ్మద్(స)కు మాట కూడా ఇచ్చారు. ఏమనంటే-

"మేం మా ధన ప్రాణాలను, మా సంతానాన్ని దైవధర్మ స్థాపన కోసం త్యాగం చేస్తాం" అని వాగ్దానం చేశారు.

ఆ తరువాత దైవాజ్ఞ వచ్చింది. ప్రియప్రవక్త (స) ఆయన సహచరులు (రజి) హిజ్రత్ చేసి మదీనా చేరారు. కాని మక్కా వాసులు వారిని మదీనాలోనూ విడిచిపెట్టలేదు. మూడు వందల మైళ్ళ కన్నా ఎక్కువ దూరం ఉన్న మదీనాలోనూ అవిశ్వాసులు వెంటాడి దాడులు చేయడం మానలేదు. ప్రవక్త మదీనాకు హిజ్రత్ చేసిన రెండవ సంవత్సరమే బద్ర్ అనే ప్రాంతం వద్ద భీకర యుద్ధం జరిగింది. అవిశ్వాస శత్రుమూకలు ముస్లిమ్‌లకన్నా మూడు రెట్లు ఎక్కువగా ఉన్నారు. పైగా వారి వద్ద యుద్ధసామాగ్రి అంటే ఆయుధాలు, తదితర సామానులు పుష్కలంగా ఉన్నాయి. అయినా, దైవసహాయం వల్ల ముస్లిమ్‌లు విజయం సాధించగలిగారు.

ఈ ఓటమికి ప్రతీకారం తీర్చుకునేందుకుగాను, మరుసటి సంవత్సరం శత్రువులు మళ్ళీ దాడి చేశారు. ఈసారి బృహత్తరమయిన ఏర్పాట్లు చేసుకుని వచ్చారు. మదీన్కా నుంచి మూడు లేక నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న 'ఉహుద్' అన్న ప్రాంతం వద్ద పోరాటం జరిగింది. హజ్రత్ ఉమ్మె అమ్మారా(రజి) కూడా ఈ యుద్ధంలో పాల్గొన్నారు. ధర్మయుద్ధంలో పాల్గొంటున్నవారికి నీళ్ళు అందించడం, గాయపడినవారికి చికిత్స చేయడం చేసేవారామె. ముస్లిమ్‌లు

సంఖ్యలో చాలా తక్కువ ఉన్నప్పటికీ దైవసహాయం వల్ల గెలువసాగారు. శత్రుసైన్యం కకావికలం కాసాగింది. కాని, ముస్లిమ్‌లు చాలా మంది యుద్ధంలో లభ్యమయ్యే ధనరాసుల్ని ప్రోగుచేయడంలో పడ్డారు. అకస్మాత్తుగా శత్రువులు వెనుదిరిగి మళ్ళీ దాడి చేశారు. ముస్లిమ్‌లు ఈ దాడిని ఊహించలేదు. యుద్ధస్థితే మారిపోయింది. ముస్లిమ్‌లు సంకట స్థితిలో పడ్డారు. అనేక మంది ముస్లిమ్‌లు అమరగతులయ్యారు. అనేక మంది గాయపడ్డారు. ఇంతలో హుజూర్ ముహమ్మద్ (స) అమరగతు లయ్యారన్న పుకారు లేచింది. ఈ పుకారు వల్ల ముస్లిమ్‌ల ధైర్యస్థయిర్యాలు మరింత దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిని కళ్ళారా చూసిన హజ్రత్ ఉమ్మె అమ్మారా (రజి), చేతిలోని నీళ్ళ సంచిని పారవేసి డాలు, ఖడ్గం చేతబట్టుకున్నారు. ముహమ్మద్ ప్రవక్త (స) రక్షణ బాధ్యతను నెరవేర్చసాగారు. ఆమె కుమారుడు కూడా దగ్గరకు వచ్చి ప్రవక్త (స)కు రక్షణగా నిలబడ్డారు. హుజూర్ (స) పై లేచిన ప్రతి శత్రు ఖడ్గాన్ని ఈ తల్లీకొడుకులు నిరోధించి జవాబీయసాగారు.

ఈ పోరాటంలో వాళ్ళిద్దరూ తీవ్రగాయాలకు లోనయ్యారు. హజ్రత్ ఉమ్మె అమ్మారా (రజి) శరీరంపై గాయాలు లెక్కబెట్టలేనన్ని ఉన్నాయి. యావత్తు శరీరం రక్తంతో స్నానమాడినట్లయ్యింది. అయినా ఆ దైవదాసురాలు మక్కాలో ప్రవక్త (స)కు ఇచ్చిన మాటను- ధన, ప్రాణాలను, సంతానాన్ని త్యాగం చేస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవడానికి అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉంది. చివరికి దైవ సహాయం లభించింది. అవిశ్వాసులు అకస్మాత్తుగా యుద్ధ మైదానం వదిలి పారిపోసాగారు. యుద్ధం ముగిసింది. ముస్లిమ్‌లంతా ఒక్క చోటజేరారు. హుజూర్ (స) హజ్రత్ ఉమ్మె అమ్మారా (రజి) చేసిన పనిని బహుధా ప్రశంసించారు. అప్పుడు ఆమె ఏమన్నారో తెలుసా-

"ఓ దైవ ప్రవక్తా! నా కోసం దైవాన్ని ప్రార్థించండి. మీ మార్గాన నడిచే నాకు స్వర్గప్రాప్తిని కలుగజేయమని దైవాన్ని ప్రార్థించండి."

ఆమె కోరిన విధంగా ప్రవక్త (స) ప్రార్థన చేశారు. అప్పుడామె - "ఇక చాలు. ఇప్పుడు ఎంతటి కష్టం ఎదురైనా నాకేం ఫర్వాలేదు" అని అన్నారు.

# అభిమానం

యావత్ విశ్వానికి ప్రభువు, పోషకుడు దైవం. అందరినీ పుట్టించింది అతడే. అందరి అవసరాలను తీరుస్తున్నాడు. అందువల్ల అందరికీ పూజనీయుడు, అందరి పాలకుడు అతడే. మనం దైవానికి కృతజ్ఞులమై ఉండాలి. దైవాదేశాల మేరకు జీవితాన్ని గడపాలి. అందులోనే మన సాఫల్యం ఉంది. దైవం తన మనుష్యుల పట్ల అపార కరుణ చూపుతాడు. దైవం మనుష్యుల కోసం, తమ జీవితాన్ని గడిపే సక్రమ మార్గాన్ని చూపాడు. తద్వారా తాను ప్రసాదించిన సౌభాగ్యాలతో ప్రజలు పూర్తిగా లాభపడేలా చేశాడు. చెడు మార్గాన పడి ఇహపరలోకాల సాఫల్యాన్ని దూరం చేసుకునే పరిస్థితి రాకుండా చేశాడు. ఇది దేవుని కరుణకు తార్కాణం. మనిషికి సవ్యమార్గాన్ని చూపడం కోసం దైవం హితబోధనలకు అవసరమయిన ఏర్పాట్లు చేశాడు. తన సందేశాన్ని మనుష్యులకు చేరవేయడానికి అనేక మంది సందేశహరులను పంపాడు. చిట్టచివరి దైవప్రవక్తగా హ్రజత్ ముహమ్మద్ ముస్తఫా (స)ఈ లోకంలో అవతరించారు. దైవం ఆయన్ని యావత్ ప్రపంచానికి కారుణ్యంగా చేసి పంపాడు. ముహమ్మద్ (స) ప్రేమతో, హృదయాలను గెలుచుకునే విధంగా దైవ సందేశాన్ని ప్రజలకు వినిపించడం ప్రారంభించారు. మంచివాళ్ళు ఆయన బోధనలను అంగీకరించారు. దైవేచ్ఛకు అనుగుణంగా నడువసాగారు. చెడ్డవాళ్ళు ముహమ్మద్ (స) బోధనలపై ద్వేషాన్ని వెళ్ళగ్రక్కారు. ఆయన్ను కష్టపెట్టనారంభించారు. ముహమ్మద్ (స), ఆయన ప్రియసహచరులు (రజి) దీర్ఘకాలంపాటు కష్టనష్టాల్ని అనుభవించారు. అయినా అజ్ఞానులయిన అవిశ్వాసులకు సాఫల్యమార్గాన్ని చూపుతూనే ఉన్నారు. కాని, మక్కాలోని అవిశ్వాసులు ఈ శ్రేయోభిలాషుల్ని తమ మధ్య భరించలేకపోయారు. ముహమ్మద్ (స)ను హత్య చేయాలని పథకాలు రచించసాగారు. ఈ పరిస్థితిలో దైవం ముహమ్మద్ (స)ను హిజ్రత్ చేసి మదీనా వెళ్ళవలసినదిగా ఆజ్ఞాపించాడు. హుజూర్ (స), ఆయన ప్రియసహచరులు హిజ్రత్ చేసి మదీనా వెళ్ళిపోయారు.

కాని, మక్కా అవిశ్వాసులు అక్కడ కూడా వదిలిపెట్టలేదు. కవ్వింపులు, పోరాటాలు, యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. ఓసారి ఆ ముష్కర మూకలు పెద్ద ఎత్తున దాడి చేశాయి. అరబ్బులలోని వివిధ తెగలకు చెందిన వ్యక్తులను ప్రోగుచేసి వారికి ఆయుధాలను, వాహనాలను సమకూర్చి, అరబ్బు భూభాగంలో సత్యధర్మాన్ని పూర్తిగా కనుమరుగు చేయాలన్న ఉద్దేశ్యంతో దాడి చేశారు. ముస్లిమ్‌లకయితే ఇది అత్యంత సున్నిత పరిస్థితి. ముస్లిమ్‌ల ధన, మాన, ప్రాణాలకు మించి ముహమ్మద్ (స) ద్వారా ప్రచారమవుతున్న ఇస్లామ్ సత్య సందేశానికి ప్రమాదం వాటిల్లింది. అందువల్ల స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు యావన్మంది పోరాటానికి సంసిద్ధులైపోయారు. మదీనాకు మూడు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న ఉహుద్ అనే ప్రాంతంలో పోరాటం మొదలయ్యింది. ఆయుధాలు చేబూని పోరాడుతున్న పురుషులతోపాటు స్త్రీలు నీళ్ళ సంచులను భుజాన్నేసుకుని యుద్ధం చేస్తున్నవారికి నీళ్ళు అందించసాగారు. గాయపడినవారికి చికిత్స చేయసాగారు. అది చాలా కఠిన పరిస్థితి. అవిశ్వాసులు ముస్లిమ్‌లకన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా ఉన్నారు. ముస్లిమ్ సైనిక దళాలకు స్వయంగా హుజూర్ (స) నాయకత్వం వహించారు. హుజూర్ (స) ప్రియసహచరులు ప్రాణాలొడ్డి పోరాడసాగారు. దైవసహాయం లభించింది. శత్రువుల గుండెలు బేజారయ్యాయి. కాని, కొందరు ముస్లిమ్‌ల తొందరపాటు వల్ల మళ్ళీ పరిస్థితి తారుమారయ్యింది. శత్రువులు వెనుకపాటున దెబ్బతీశారు. ఫలితంగా అనేక మంది ప్రవక్త (స) సహచరులు గాయపడ్డారు. అనేక మంది అమరగతులయ్యారు. స్వయంగా హుజూర్ (స) అమరగతులయ్యారన్న పుకారు పుట్టింది. అందువల్ల కొందరు ముస్లిమ్‌లు నిరాశా నిస్పృహల్లో మునిగి వెనుదిరిగి మదీనా దగ్గరకు చేరుకున్నారు. దారిలో వారికి హజ్రత్ ఉమ్మె ఎమన్ (రజి) కనబడ్డారు. ఆమె ప్రవక్త (స) సహచర వర్గంలోని ప్రముఖ మహిళ. ఆమె నీళ్ళ సంచిలో నీళ్ళు తీసుకుని యుద్ధరంగం వైపు వెళుతున్నారు. పారిపోయి వస్తున్నవారిని చూడగానే ఆమె రక్తం సలసల కాగింది. వాళ్ళపై ఆగ్రహంతో మండిపడ్డారు.

"ప్రియప్రవక్త (స)ను విడిచి మీరు ఏ ముఖం పెట్టుకుని పారిపోయి వస్తున్నారు. ఎలాంటి మగవాళ్ళయ్యా!....తీసుకోండి, మా గాజులు తొడుక్కుని ఇంట్లో కూర్చోండి. వంట గదిలో పనులు చూసుకోండి. ఆ ఆయుధాలు ఇలా ఇవ్వండి. ఇప్పుడు మీ స్థానంలో మేం స్త్రీలం పోరాడుతాం."

హజ్రత్ ఎమన్ (రజి) చురకలతో పారిపోయివస్తున్నవారి అభిమానం దెబ్బతింది. వెంటనే వెనుదిరిగి పోరాటంలోకి వెళ్ళి ఒక్కసారిగా శత్రువులపై విరుచుకుపడ్డారు. శత్రువుల గుండెలు బేజారెత్తిపోయాయి. చివరికి పారిపోయారు. ఈ విధంగా కొందరు ముస్లిమ్‌ల తొందరపాటుతనం, బలహీనతల కారణంగా సత్యధర్మానికి వాటిల్లబోయే ప్రమాదాన్ని దైవం తప్పించాడు.

# ధర్మాభిమానం

మనం ప్రతి రోజు కలుసుకునే ప్రజలలో సాధారణంగా రెండు రకాలవాళ్ళు ఉంటారు. మొదటివాళ్ళు: సచ్ఛీలం, దైవభీతి గలిగి దైవాజ్ఞల ప్రకారం నడిచేవాళ్ళు. రెండవ రకం: దుర్మార్గులు, దైవద్రోహులు. సచ్ఛీలం, దైవభీతి కలిగినవారిని ప్రేమించడం, అలాంటివారికి చేరువవ్వడం అన్నది సహజం. కాని, చెడు నడత కలిగినవారికి సంబంధించినంతవరకు వారి చెడు కార్యకలాపాలకు సాధారణంగా వారి మనసే అంగీకరించదు. ఇస్లామ్ విశ్వాసం ప్రకారం మనం అలాంటివాళ్ళతోనూ మంచిగా వ్యవహరించాలి. వారి పట్ల మృదువుగా, ఆపేక్షతో వ్యవహరించాలి. ఆ రకంగా వాళ్ళు మనకు చేరువయ్యేలా చేయాలి. వారి అభిప్రాయాలు, వ్యతి రేకతలు, భావాలు తెలుసుకోవాలి. తద్వారా వారి చెడు నడతకు అసలు కారణం రాబట్టగలం. ఆపై సముచితమయిన రీతిలో వారిని మంచి మార్గంపై మరల్చగలం. తనను వ్యతిరేకించేవారి మాటలను వినే సహనం, విభేదాలున్నప్పటికీ, వ్యతిరే కించేవారి శ్రేయాన్ని కోరే సహృదయం లేనివాళ్ళు ఎలాంటి సంస్కరణలనూ చేయలేరు. ప్రజలు

సాధారణంగా ఎవరినైతే శ్రేయోభిలాషులుగా సానుభూతి పరులుగా భావిస్తారో వారి మాటలనే వింటారు.

కాని, కొందరు నైతికత, నిష్పాక్షికతకు వక్ర అర్థాలను ఆపాదించడం మొదలుపెట్టారు. దైవద్రోహులు, ధర్మశత్రువులు దుర్మార్గులను గౌరవించడం, వారి చెడు పనులకు, చెడు మాటలకు వంత పాడటం నిష్పాక్షికత అని అనుకుంటున్నారు. కాని, ఇస్లామ్ ప్రకారం ఈ ధోరణి అభిమానం లేకపోవడానికి నిదర్శనం. ఈ ధోరణి నిష్పాక్షికం కాదు. దుర్మార్గులకు కొమ్ము కాయడం, ఇలా చేయడం వల్ల ధర్మం నిరాదరణకు గురవుతుంది. దుర్మార్గులు తమ కార్యక్రమాలల్లో మరింత ఉత్సాహం చూపిస్తారు. తమ తప్పుడు విశ్వాసాలు, దుర్నడతతో వాళ్ళు తమ జీవితాలనే కాక, తమ తోటివారి జీవితాలనూ నష్టపరుస్తారు.

బుద్ధివివేకాలున్న అమ్మాయిలు దుష్ట సహవాసం వల్ల కలిగే హానిని బాగుగా గుర్తించగలరు. అందువల్లనే మంచి సంస్కారం, నైతిక వర్తనం కలిగి ఉండటమేకాక, ధర్మతిరస్కారులకు, దుష్టశక్తులకు అవకాశమిచ్చే విధంగా ఎన్నడూ వ్యవహరించరు. దుర్మార్గులు తమ దుష్ట కార్యకలాపాల్లో మరింత పెట్రేగిపోనివ్వకుండా తమ వ్యవహారశైలితో వారిలోని లోపాన్ని ఎత్తిచూపుతారు.

హజ్రత్ ఉమ్మె హబీబ (రజి) మన ప్రియప్రవక్త (స)కు ప్రియమయిన భార్య. ఆమె అబూ సుఫ్యాన్ (రజి) కుమార్తె. ఆమె తండ్రి అబూ సుఫ్యాన్ (రజి) మక్కాలో ఉండేవారు. ఇస్లామ్‌ను స్వీకరించకముందు ఆయన దైవ తిరస్కారులకు నాయకుడిగా, ధర్మవిద్రోహిగా పేరు గడించారు. మక్కాలో సత్యధర్మ ప్రచారం జరుగుతున్నప్పుడు ఆయన ఆ ప్రచారాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవారు. దైవ తిరస్కారులను రెచ్చగొట్టి, హుజూర్ ముహమ్మద్ (స), ఆయన అనుయాయుల (రజి)ను, అనేక బాధలు పెట్టేవారు. దైవతిరస్కారులు పెడుతున్న యాతనలను భరించలేక స్వయాన ఆయన కుమార్తె ఉమ్మె హబీబ (రజి) హిజ్రత్ చేసి హబ్ష (ఆఫ్రికా) వెళ్ళవలసివచ్చింది.

హిజ్రత్ జరిగిన అనేక సంవత్సరాల తరువాత ముస్లిమ్‌లకు, దైవ తిరస్కారులకు మధ్య ఓ ఒప్పందం కుదిరింది. ఒప్పందంలో షరతులను కుదుర్చుకోడానికిగాను తిరస్కారుల తరపు నుంచి అబూ సుఫ్యాన్ (రజి) మదీనా వచ్చారు. అక్కడ ఆయన కుమార్తె ఉమ్మె హబీబ (రజి) ఉన్నారు. కూతురిని కలువడానికి అబూ సుఫ్యాన్ (రజి) ఆమె వద్దకు వెళ్ళారు. ఆమె గదిలో పక్కపరచి ఉంది. తండ్రిని చూసి బీబీ ఉమ్మె హబీబ (రజి) పక్కను చుట్టేశారు. అబూ సుఫ్యాన్ (రజి) ఖంగుతిన్నారు. పక్కపరచి కూర్చుండబెట్టేది పోయి, పరచిన పక్కను ఎత్తేయడం ఆయనకు అర్థం కాలేదు. కూతురిని అలా ఎందుకు చేశావని అడిగారు. అప్పుడు ఉమ్మె హబీబ (రజి) అన్నారు కదా, "ఇది ప్రియప్రవక్త (స) పడుకునే పక్క. నువ్వు బహుదైవారాధకుడివి. బహు దైవారాధకులు విశ్వాసం రీత్యా అపవిత్రులు. ఈ పవిత్రమయిన పక్కపై నిన్నెలా కూర్చుండబెట్టను?"

తరువాత ఈ తండ్రి దైవ తిరస్కారాన్ని విడిచిపెట్టి ముస్లిమ్ అయినప్పుడు కూతురి వైఖరి చాలా మారిపోయింది. ఆయన్ను అమితంగా ప్రేమించింది.ఆయన మరణానంతరం ధర్మశాస్త్ర అనుమతి ప్రకారం మూడు రోజులపాటు శోకాన్ని పాటించింది.

అలాగే మరో దైవ తిరస్కారుల నాయకుడు అబూ జహల్ దైవ ధర్మానికి పచ్చి శత్రువు. హుజూర్ (స) ఆయన ప్రియ సహచరులకు ఇతగాడి వల్ల అనేక కష్టాలు ఎదురయ్యాయి. బద్ర్ యుద్ధంలో ఇతగాడు అమితోత్సాహంతో పాల్గొన్నాడు. ఆ యుద్ధంలోనే నిహతుడయ్యాడు. వీడి పని సమాప్తం చేసిన వారిలో హజ్రత్ ముఅవ్వజ్ (రజి) కూడా ఉన్నారు. హజ్రత్ ముఅవ్వజ్ (రజి) కుమార్తె పేరు రబియా. ఆమె కూడా ప్రవక్తకు ప్రముఖ అనుచరురాలు.

ఓనాడు ఏమయ్యిందంటే, ఆమె ఇంటికి ఓ స్త్రీ అత్తరు అమ్ముతూ వచ్చింది. మాటల్లో రబియా తన తండ్రి పేరు చెప్పింది. ఆ పేరు వినగానే ఆ స్త్రీ నోటి నుంచి అసంకల్పితంగా, "అలాగా! అంటే నువ్వు మన నాయకుడి హంతకుడి కూతురివన్న మాట."

అబూ జహల్ లాంటి ధర్మవిద్రోహిని నాయకుడిగా వర్ణించడంతో బీబీ రబియా ఆగ్రహంతో మండిపడ్డారు.

"కాదు, నేను మన బానిసను హత్యచేసిన వారి కుమార్తెను" అని బదులిచ్చారు.

అబూ జహల్‌ను బానిస అని అనడం ఆ స్త్రీకి నచ్చలేదు. "నేను మీకు అత్తరు అమ్మడం హరామ్ అనుకుంటున్నాను" అంది.

అది విన్న రబియా వెంటనే, "నీ దగ్గర్నుంచి అత్తరు కొనడం హరామ్ అనుకుంటున్నాను నేను. ఎందుకంటే నీ దగ్గరున్న అత్తరులాంటి అపవిత్రమైన, దుర్వాసన వెదజల్లే అత్తరు నేనెక్కడా చూడలేదు" అని ఒక్కసారిగా జవాబిచ్చారు.

# గుర్తుంచుకోవలసిన మాటలు

ప్రియమైన అమ్మాయిలూ! మీరు అనేక మంది ప్రముఖ మహిళల గురించి చదివారు. వారంతా దైవేచ్ఛ ప్రకారం నడిచిన పుణ్యస్త్రీలు. వాళ్ళు దైవ హక్కులను తెలుసుకున్నారు. దైవప్రేమలో, దైవాజ్ఞాపాలనలో ప్రపంచానికి ఉదాహరణలుగా నిలిచారు. దైవం వారి అస్తికలను పువ్వుల్లో ఉంచుగాక. దైవ హక్కులు మాత్రమేకాక దైవం, దైవ ప్రవక్తల తరపున మనపై మానవ హక్కులను నిర్వర్తించే బాధ్యత కూడా పడుతూంది. మీరు ఇంతవరకు చదివిన మహిళలు తమ బాధ్యతలను కడు చక్కగా పూర్తి చేశారు. కొందరు కుమార్తెలుగా తమ తల్లిదండ్రులకు కీర్తి తెచ్చిపెట్టారు. కొందరు సోదరీమణులుగా తమ సోదరులకు పేరుతెచ్చిపెట్టారు. కొందరు నిజమయిన అర్ధాంగికి ఉదాహరణగా నిలిచారు. కొందరు అత్యుత్తమ తల్లులుగా తమ పిల్లల విద్యాశిక్షణలకు ఉత్తమ ఏర్పాట్లు చేసి పిల్లల హక్కులను నెరవేర్చారు. ప్రతి స్త్రీ దైవదాసురాలు మాత్రమే కాక, ఒకరికి కూతురిగా, ఒకరికి సోదరిగా, పెళ్ళి తరువాత మరొకరికి భార్యగా మారి తన బాధ్యతలను పూర్తి చేయవలసి ఉంటుంది. పిల్లలు పుట్టిన తరువాత తల్లిగా బాధ్యతలను మోయవలసి ఉంటుంది. తన ఈ హోదాలను గుర్తెరిగిన

మహిళలు, తమ బాధ్యతలను చక్కగా నిర్వహించేవాళ్ళ ఉనికి ప్రపంచానికి కరుణామృతాన్ని ప్రసాదిస్తుంది. అలాంటి స్త్రీలు ఇహలోకంలో అందరికీ కంటికి దీపంలా వెలుగొందుతారు. మరణానంతరం దైవ కరుణాకటాక్షాలలో తేలియాడుతారు.

మీరు చదివిన అనేక మంది స్త్రీలలో చాలా మంది మరణించి అనేక వందల సంవత్సరాలు అయ్యింది. అయినా వారి ఉత్తమ నడవడిక, ఉన్నత కార్యాలు నేటికీ సజీవంగా ఉన్నాయి. ఈ మహిళల గురించి చదివి అనేక మంది మంచి అమ్మాయిలు జీవిత పాఠాల్ని గ్రహించారు. తమ జీవితాల్ని తీర్చిదిద్దుకున్నారు. ప్రళయం వరకు ఇంకా ఎంత మంది ఉత్తమ స్త్రీలు ఈ మహిళల జీవిత గాథల నుంచి లాభం పొందుతారో ఊహించడం కష్టం. ఆ ఉత్తమ మహిళలు ఇహలోకంలో చేసిన ఉత్తమ కార్యాలకు ఈ ప్రపంచంలో లభించిన దైవిక ఫలం, పరలోకంలో లభించే దైవ కటాక్షం అంచనా వేయడానికి అసాధ్యం.

ఏది ఏమయినా, మనందరికీ ఏదో ఓ రోజు చావు తప్పదు. మనం ఇక్కడ చేసిన పనులకు అక్కడ దైవానికి జవాబు చెప్పవలసి ఉంటుంది. మరణించిన వ్యక్తి ఇక్కడి నుంచి ఉత్త చేతులతో వెళతాడు. ధనసంపదలు, ఆభరణాలు, వస్తు సామాగ్రి ఏదీ వెంటరాదు. పరలోకంలో పనికివచ్చేవి ఇహంలో చేసిన మంచి పనులు మాత్రమే. మన జీవితంలోని వివిధ దశల్లో మనపై పడే బాధ్యతలను ఎట్టి పరిస్థితి ఎదురయినా పూర్తి చేసి తీరాలి. తద్వారా పరలోకంలో దైవం ముందు జవాబీయలేక సిగ్గుపడే పరిస్థితి రాదు. ఈ ప్రపంచం పరలోక ఫలాన్ని పొందే వ్యవసాయ క్షేత్రం. ఇక్కడ చేసిన మంచి పనులు కాల ప్రభావానికి చెక్కు చెదరక సజీవంగా నిలుస్తాయి. ఇతరులకు ఉదాహరణగా ఉంటాయి, మంచి సంకల్పంతో చేస్తే పరలోకంలో సాఫల్యానికి తోడ్పడతాయి. మీరే ఆలోచించండి. ఓ విశ్వాసికి పరలోక సాఫల్యంకన్నా ప్రియమయిన వస్తువు మరేమన్నా ఉంటుందా? దైవం మనందరికీ మంచి పనులు చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక!

- : సమాప్తం : -